నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:35 పేజీలు: 4 వెల: రూ.1/-

పేదల చెంతకే ప్రభుత్వం వస్తోంది

గతానికి భిన్నంగా కార్యక్రమాలు మధ్యప్రదేశ్‌లో గృహాలను ఆన్‌లైన్‌లో ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): గతంలో ప్రభుత్వం వెంట పేదలు పరుగెత్తే వారని, ప్రస్తుతం ప్రభుత్వం పేదల వద్దకు వెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం మధ్యప్రదేశ్‌లో ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించిన 1.75లక్షల గృహాల ప్రవేశ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని పలువురు లబ్దిదారులతో మాట్లాడారు. 2లక్షల కుటుంబాలకు అభినందనలు, ఈ సారి మీ అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు అన్నారు. కరోనా మహమ్మారి లేకపోతే మీ ప్రధాన సేవకుడు ఈ రోజు మీ జీవితంలోని గొప్ప ఆనంద క్షణాల్లో మీ మధ్య ఉండేవాడన్నారు. గతంలో పేదలు ప్రభుత్వం వెనుక పరుగులు పెట్టారని, ఇప్పుడు ప్రభుత్వం పేదల వద్దకు వెళ్తోందన్నారు. ఎవరి ఇష్టానికి అనుగుణంగా జాబితాలో పేరు జోడించడం, తీసివేయడం చేయలేమని, ఎంపిక నుంచి నిర్మాణం వరకు శాస్త్రీయ, పారదర్శక విధానాన్ని అవలంభిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ పేదలకు గృహ నిర్మాణ పథకం పారదర్శకతకు పెద్ద పీట వేస్తోందని, ప్రభుత్వం ఇప్పుడు పేదల చెంతకు చేరుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 2014లో అంతకు ముందు ఉన్న అనుభవాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. పాత పథకంలో కొన్ని మార్పులు చేసినట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజనను పూర్తిగా సరికొత్త ఆలోచనతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. గృహ ప్రవేశానికి లబ్దిదారుల ఎంపిక పక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. గతంలో పేదలు ప్రభుత్వం వెంట పరుగులు తీసేవారని, ఇప్పుడు తన ప్రభుత్వం ప్రజల చెంతకు చేరుతోందని చెప్పారు. ఇతరుల కోరిక మేరకు జాబితా నుంచి ఎవరి పేరునైనా తొలగించడం కానీ, జాబితాలో ఎవరి పేరునైనా చేర్చడం కానీ జరగదని చెప్పారు. లబ్దిదారుల ఎంపిక దగ్గర నుంచి నిర్మాణం వరకు శాస్త్రీయ, పారదర్శక విధానాన్ని అవలంబిస్తున్నట్లు తెలిపారు. స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్‌ను ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన అయినా, స్వచ్ఛ భారత్ అభియాన్ పథకం క్రింద మరుగుదొడ్ల నిర్మాణం అయినా పేదలకు లబ్ది చేకూర్చడం మాత్రమే కాకుండా ఉపాధి, సాధికారత కల్పిస్తున్నాయన్నారు. ఈ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ముల జీవితాలను మార్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. మోదీ ఈ సందర్భంగా కొందరు లబ్దిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధ్య ప్రదేశ్ గవర్నర్ ఆనంది బెన్ పటేల్, ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, బీజేపీ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సట్టా ఆటలో చోటుచేసుకున్న వివాదంలో సదరు యువకుడిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణానగర్ మెట్రో పిల్లర్ వద్ద రక్తపు మడుగులో ఓ యువకుడు పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా శరీరం, ఛాతి, కడుపులో కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 28 ఏళ్ల లోపు ఉంటుందని, అడ్డా కూలీగా పనిచేసే వ్యక్తి కావచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహం ఉన్న కొద్ది దూరంలో ప్రతిరోజూ సాయంత్రం అడ్డాకూలీలు మద్యం తాగి రాత్రివేళ సట్టా ఆడుతుంటారు. శుక్రవారం రాత్రి సట్టా ఆడుతున్న సమయంలో వివాదం జరగడంతో హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ : ప్రగతి భవన్‌లో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమావేశమయ్యారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా తెచ్చిన రెవెన్యూ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రెవెన్యూ శాఖలోని అధికారులు, సిబ్బంది సమిష్టిగా చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం సూచించారు. ప్రజలు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చామని కేసీఆర్ స్పష్టం చేశారు. ఇక నుంచి రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆయన చెప్పారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా పరిష్కరించాలని కోరారు.

గతంలో మండలాలు, గ్రామాల్లో బాగా పని చేసే అధికారులను ప్రజలు దేవుళ్లుగా భావించేవారు. మళ్లీ అలాంటి సంస్కృతిని నెలకొల్పాలి. అధికారులు తమతో ఎలా మాట్లాడుతున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తుంటారు. రెవెన్యూ యంత్రాంగం సమస్యలను పరిష్కరించే విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రజలు కేంద్ర బిందువుగానే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఆ నేపథ్యంలోనే నూతన రెవెన్యూ చట్టం తీసుకొచ్చామని సీఎం స్పష్టం చేశారు. కొత్త చట్టం ఎవరికీ వ్యతిరేకం కాదని ఆయన తేల్చిచెప్పారు.

తహసీల్దార్ కార్యాలయాలకు రూ. 60 కోట్లు

ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు సహా 54 రకాల బాధ్యతలను నిర్వహిస్తూ రెవెన్యూ సిబ్బంది కష్టపడి పని చేస్తున్నారని కేసీఆర్ ప్రశంసించారు. రెవెన్యూ శాఖలో అన్ని స్థాయిల్లో ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లకు కారు అలవెన్సు రెగ్యులర్‌గా ఇవ్వాలి. తహసీల్దార్ కార్యాలయాల్లో సౌకర్యాల కల్పన కోసం రూ. 60 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ప్రోటోకాల్ సహా కార్యాలయాల నిర్వహణ కోసం నిధుల కొరత లేకుండా చూడాలని సీఎం చెప్పారు.

రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం అండ

రెవెన్యూ యంత్రాంగానికి విధి నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. వీఆర్వోలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఇతర శాఖల్లో చేరేందుకు ఆప్షన్లు ఇస్తామన్నారు. వీఆర్ఏలలో అత్యధికంగా పేద వర్గాల వారే ఉన్నారని, వీరిలో వయోభారం ఉన్న వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వీఆర్ఏలకు పే స్కేలు ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై రూ. 260 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు సీఎం.

తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాస్‌బుక్‌ల బిల్లు-2020ను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం విదితమే. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ నూతన రెవెన్యూ చట్టంపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నూతన రెవెన్యూ చట్టం ఆమోదం పొందడంతో రైతులు సంబురాలు చేసుకుంటున్నారు.

సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఆర్.చంద్రశేఖర్‌కు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా పరిశోధన విద్యార్థులు సమర్పించే పత్రాలను ప్రచురించే జర్నల్ పత్రిక రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఆర్ఎ?సఈ) ఇంటర్నేషనల్ ఎడిటోరియల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. మెటీరియల్ అడ్వాన్సె?న పేరిట ఆర్ఎ?సఈ ప్రచురించే జనరల్ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా ప్రొఫెసర్ చంద్రశేఖర్ సేవలు అందించనున్నట్లు వర్సిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం వర్సిటీలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు.

యాదాద్రిలో చురుకుగా నిర్మాణ పనులు

మరోమారు ఆలయాన్ని సందర్శించనున్న సిఎం కెసిఆర్ -నేడు ఆలయ దర్శనం చేస్తారని సమాచారం

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ మరోమారు పవిత్ర పుణ్యక్షేత్రం యాదాద్రిని సందర్శించనున్నట్లు తెలుస్తోంది. అక్కడి పనులను పర్యవేక్షించేందుకు ఆదివారం ఆయన యాదాద్రి వస్తారని అంటున్నారు. ఈ మేరకు సిఎం కెసిఆర్ పర్యటన ఖరారైందని ఆదివారం యాదాద్రిని దర్శించనున్నారు. శరవేగంగా కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించబోతున్నారు. యాదాద్రి ఆలయ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్న సీఎం కేసీఆర్ యాదాద్రికి వెళ్లి స్వయంగా పరిశీలించాలని నిర్ణయించుకున్నారు. ఇటీవలి కాలంలో ఆయన యాదాద్రికి రాలేకపోయారు. అందులో భాగంగా ఆదివారం ఆయన యాదాద్రి పర్యటనకు వెళ్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు ఒక నివేదక రూపంలో సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో కేసీఆర్ యాదాద్రి వెళ్లారు. ఆ తరువాత మళ్లీ ఇప్పుడు వెళ్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా యాదాద్రి ఆలయ తుది దశ పనులు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ నిర్మిస్తున్న ఆరు వరుసల రింగ్ రోడ్డు పనులు వేగంగా చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో మొక్కల పెంపకం పనులు సాగుతున్నాయి. ఇటీవల మహాబలిపురం నుంచి తెప్పించిన విగ్రహాల అమరిక పనులు పూర్తి చేస్తున్నారు. కాంప్లెక్స్, శివాలయం, పుష్కరిణి పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఆలయానికి నలుదిక్కులా సింహం, ఐరావతం విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. యాదాద్రి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పునర్‌నిర్మిస్తోంది. దాదాపు రూ.2వేల కోట్ల తో దీని నిర్మాణం చేపట్టింది. యాదాద్రి పుణ్య క్షేత్రానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివచ్చేలా అద్భుతంగా నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయి. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరేలా అక్కడ పచ్చదనం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదిలావుంటే కరోనాతో యాదాద్రి ఆలయాన్ని మూసివేశారు. మూడురోజుల దర్శనాలు నిలిపివేశాక తాజాగా శనివారం మళ్లీ భక్తులకు అనుమతించారు. కేవలం పరిమిత సంఖ్యలో మాత్రమే భక్తులకు అనుమతి ఇస్తున్నారు. దీంతో శనివారం ఆలయానికి మళ్లీ భక్తుల రాక మొదలయ్యింది.

తెలుగు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ సర్వీసలు పునరుద్ధరణ

నేడు ఇరు రాష్ట్రాల మంత్రుల సమావేశంలో చర్చ

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు ఆదివారం భేటీ కానున్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశానికి మంత్రులు పువ్వాడ అజయ్, పేర్నినానితో పాటు ఇరు రాష్ట్రాల ఆర్టీసీ ఎండీలు, అధికారులు హాజరు కానున్నారు. తెలంగాణ, ఏపీ మధ్య ఆర్టీసీ బస్‌ఉలు నడిపే విషయమై భేటీలో చర్చించనున్నారు. లాక్‌డౌన్ కారణంగా ఇరు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే. కేవలం అత్యవసర సర్వీసులకు మాత్రమే ఇరు రాష్ట్రాల మధ్య అనుమతి ఉంది. తెలుగు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ బస్సులు నడపడానికి ఉన్న ప్రతిబంధకాలను తొలగించే లక్ష్యంతో హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు. ఎలాగైనా ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించేందుకు ఉన్న అవకాశాలను ఇరు రాష్ట్రాల రవాణా మంత్రులు చర్చించనున్నారు.

కాగా కరోనా వ్యాప్తి కారణంగా లాక్‌డౌన్ విధించినప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ఇటీవల లాక్‌డౌన్ ఎత్తివేడంతో ఇరు రాష్ట్రాల్లో ఆర్టీసీ బస్సులు ప్రారంభమైన ప్పటికీ రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు మాత్రం ప్రారంభం కాలేదు. దీనిపై ఇరు రాష్ట్రాల రవాణాశాఖ అధికారుల మధ్య జరిగిన చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయి. ఇరు రాష్ట్రాల నుంచి సమానంగా సర్వీసులు నడపాలని తెలంగాణ పట్టుబడుతున్న నేపథ్యంలో నిలిచిపోయిన చర్చలను ఎలాగైనా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు మరోసారి సిద్ధమవుతున్నాయి.

మాతృభాషలో బోధన మంచి నిర్ణయం

ప్రధానికి అభినందనలు తెలిపిన వెంకయ్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): 5వ తరగతి వరకూ మాతృభాషలో విద్యాబోధన జరగాలన్న ప్రధాని మోదీకి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులను పిల్లల చదువులతో అనుసంధానం చేసే సంకల్పంతోనే ఐదో తరగతి వరకైనా మాతృభాషలో బోధనను నూతన విద్యావిధానం సూచించిందన్నారు. 5వ తరగతి వరకూ మాతృభాషలోనే విద్యాబోధన చిన్నారుల మానసిక వికాసంలో కీలకపాత్ర పోషిస్తుందని '21వ శతాబ్దంలో పాఠశాల విద్య' అనే అంశం మీద జరిగిన జాతీయ స్థాయి సమ్మేళనంలో స్పష్టంగా తెలియజేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులను పిల్లల చదువులతో అనుసంధానం చేసే సంకల్పంతోనే సాధ్యమైనంత వరకూ కనీసం ఐదో తరగతి వరకైనా మాతృభాషలో బోధనను నూతన విద్యావిధానం సూచించిందని, ఇతర భాషలు నేర్చుకోవడం, నేర్పించడంపై ఎలాంటి అడ్డంకులూ కల్పించలేదన్న శ్రీ మోదీ మాటలు అక్షర సత్యాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

కొత్త రెవెన్యూ చట్టం దేశంలోనే గొప్పది: సబిత

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన రెవెన్యూ చట్టం దేశంలోనే గొప్పదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ చట్టంతో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మంత్రి ఈరోజు రంగారెడ్డి జిల్లాలోని కందూకూరు మండలం లేమూరులో పర్యటించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డితో కలిసి సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో అన్నిరకాల సేవలు ఆన్‌లైన్‌లోనే పూర్తి పారదర్శకంగా, సరళీకృతంగా జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఈ చట్టాన్ని స్వాగతిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో డిజిటల్ తరగతులు ఎలా కొనసాగుతున్నాయని స్థానిక విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిన్న ఏ స్జబెక్ట్ చెప్పారు, ఎంతవరకు అర్థమవుతున్నాయని వాకబు చేశారు. బాగా చదువుకోవాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే అంబులెన్సులకు కెటిఆర్ ప్రారంభోత్సవం

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ పేరుతో ప్రభుత్వానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంబులెన్స్‌లను అందజేస్తున్న విషయం తెలిసిందే. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రెండు అంబులెన్స్‌లను సమకూర్చారు. నగరంలోని బుద్ధ భవన్ ఆవరణలో ఈ రెండు అంబులెన్స్‌లను మంత్రి కేటీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కార్యక్రమాల్లో ముందుండాలి

ప్లానింగ్,డిజైనింగ్ పక్కాగా చేపట్టాలి హెచ్ఎండిఎతో సమీక్షలో మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): హెచ్ఎండీఏ చేపట్టిన మౌలికవసతుల కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకుపోయేందుకు ప్రయత్నం చేయాలని అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ రానున్న కాలంలో ప్లానింగ్, విజనింగ్, డిజైనింగ్ వంటి అంశాలపై మరింత దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ఇప్పటినుంచే ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. శనివారం ఆయన హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతున్న మౌలికవసతుల కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. టీఎస్ బిపాస్ చట్టం వచ్చిన తర్వాత హెచ్ఎండిఎలో జరగబోయే మార్పులకు సంబంధించి ఇప్పటి నుంచి సిద్ధంగా ఉండాలని.. ఔటర్ రింగ్ రోడ్ కి సంబంధించిన చర్చ సందర్భంగా .. అవుటర్ రింగ్ రోడ్డు పైన చేపడుతున్న మౌలిక వసతుల కార్యక్రమాలకు సంబంధించి వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు మంత్రి కేటీఆర్. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ పరిధిలో ఉన్న బఫర్ జోన్ లో వచ్చిన నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఔటర్ రింగ్ రోడ్ విస్తరించి ఉన్న జిల్లాల కలెక్టర్ల సహకారాన్ని ఈ విషయంలో తీసుకోవాలని సూచించారు. అసెట్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసి, దాని ద్వారా ఈ విషయంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి వే సైడ్ అమెనిటిస్ ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్ పైన ప్రస్తుతం కొనసాగిస్తున్న గ్రీనరీ కార్యక్రమాలపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కేటీఆర్, అధికారులను ఈ విషయంలో అభినందించారు. హెచ్ఎండిఎ నిర్మిస్తున్న ఫ్ఐఓవర్లు, మెహదీపట్నం, ఉప్పల్ స్కైవేలను కూడా ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సమీక్షించారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందచేసిన అంబులెన్సులను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

తెలంగాణలో మరో 2,278 పాజిటివ్ కేసులు

-తాజాగా కరోనాతో మరో 10 మంది మృతి

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. రోజురోజుకు కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా 2,278 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా... గడిచిన 24 గంట్లలో కరోనాతో 10 మంది మృతి చెందారు. తెలంగాణ వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,54,880కు చేరింది. అలాగే కరోనా బారిన పడి మొత్తం 950 మంది మరణించారు.

ప్రస్తుతం తెలంగాణలో 32,005 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి కోలుకుని 1,21,925 మంది డిశ్చార్జ్ అయ్యారు. కొత్తగా జీహెచ్ఎంసీలో 331, రంగారెడ్డిలో 187, మేడ్చల్‌లో 150 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

గడిచిన 24గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 2,278 కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,54,880కి చేరింది.

వైరస్‌తో 10 మంది మృతి చెందగా, మొత్తం 950 మంది మృత్యువాతపడ్డారు. మరో 25,050 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రంలో కరోనా మరణాల రేటు 0.61శాతం ఉండగా, దేశంలో 1.66 శాతంగా ఉందని చెప్పింది. అలాగే రికవరీ రేటు 78.7శాతంగా ఉందని, ఇది దేశ సగటు (77.75) కంటే ఎక్కువని పేర్కొంది. శుక్రవారం 62,234 శాంపిల్స్ పరీక్షించగా, ఇప్పటికీ 20,78,695 నమూనాలను పరిశీలించినట్లు తెలిపింది. ఇంకా 2,027 నమూనాల ఫలితాలు రావాల్సి ఉందని, పది లక్షల జనాభాకు 55,989 మందికి టెస్టులు చేసినట్లు చెప్పింది. తాజాగా నమోదైన కేసుల్లో గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో 331 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయి. తర్వాత రంగారెడ్డి 184, మేడ్చల్ మల్కాజ్‌గిరి 150, నల్గొండ 126, కరీంనగర్ 121, వరంగల్ అర్బన్ 91, ఖమ్మం 98 కేసులు రికార్డయినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వివరించింది.

మహారాష్ట్రలో కొనసాగుతున్న కరోనా విలయం

-కొత్తగా 393 మంది మృత్యువాత

ముంబై,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా విలయం కొనసాగుతూనే ఉంది. గత 24 గంటల్లో అత్యధికంగా మహారాష్ట్రలో కొత్తగా 24,886 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఒక్క మహారాష్ట్రలోనే మొత్తం కేసుల సంఖ్య 10,15,681కు చేరుకుంది. కొత్తగా 393 మంది మరణించగా, ఇప్పటివరకు 28,724 మంది కరోనా కారణంగా మరణించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత కొన్ని రోజులుగా ప్రతిరోజు 20వేలకు పైగానే కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయి. ఈ లెక్కన ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులతో నాల్గవ స్థానంలో ఉన్న రష్యాను తొందర్లోనే దాటేసేలా ఉంది. ఇప్పటి వరకు రష్యాలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 10,51,874గా ఉంది. అంటే కరోనా కేసుల విషయంలో మహారాష్ట్ర రెండు, మూడు రోజుల్లో రష్యాను దాటేయనుంది. (భారత్: 46 లక్షలు దాటిన కరోనా కేసులు)కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య సైతం గణనీయంగా పెరుగుతుంది. గత 24 గంటల్లో 14,308 మంది డిశ్చార్జ్ కాగా మొత్తం కోలుకున్నవారి సంఖ్య 7,15,023కు పెరిగింది. రికవరీ రేటు 70.4?గా ఉండగా, మరణాల రేటు 2.83?గా ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 50.72 లక్షలమందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పరీక్షలు పెంచడంతో పాజిటివ్ కేసులు సైతం ఎక్కువగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. దేశ జీడీపీలో మహారాష్ట్ర వాట సుమారు 15 శాతం. భారత ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబైలో పరిస్థితి ఇలాగే కొనసాగితే మన్ముందు చాలా కష్టమంటున్నారు ఆర్థిక నిపుణులు. దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలకు రైలు సేవలు పునఃప్రారంభమైనా, మహారాష్ట్రలో మాత్రం నిలిచిపోయాయి. ఇప్పటికే కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో మళ్లీ రైలు సేవలు ప్రారంభిస్తే సెకండ్ వేవ్ మొదలవుతుందని అంచనా. (400 కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు)

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-కొత్త రెవెన్యూ చట్టంపై మంత్రి తలసాని

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): రైతుల బాధలు ముఖ్యమంత్రికి తెలుసని, అందుకే రైతులకు మంచి చేసేందుకే నూతన రెవెన్యూ చట్టం తీసుకొచ్చారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. కొత్త రెవెన్యూ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ కారణజన్ముడని అన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. తద్వారా తరతరాల బాధలకు చరమగీతం పాడారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఎవరూ ఆలోచించని విధంగా పేదలకోసం కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో అద్భుత పథకాలను ప్రవేశపెట్టారని వెల్లడించారు. అన్ని రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారని తెలిపారు. పలు పథకాల ద్వారా ఆదుపడుచులకు అండగా ఉన్నారని చెప్పారు. గడిచిన ఆరున్నరేండ

దేవాదాయ,వక్ఫ్ భూములను తక్షణం స్వాధీనం చేసుకోవాలి

నేటినిజం
ఆదివారం 13-9-2020

కాలం మారుతోంది. రకరకాల మనుషులు పుట్టుకుని వస్తున్నారు. రకరకాల నేరాలు జరుగుతున్నాయి. బడితె ఉన్నోడిదే బర్రె అన్న సామెతకు చరమగీతం పడింది. ఏదైనా నిజాయితీగా పని చేసుకో వాల్సిందే. అమ్మాయిలను చెరపడతామంటే కుదరదు. రేప్‌లు చేసే ఎంజాయ్ చేద్దామంటే ఎన్‌కౌంటర్ కావాల్సిందే. దొంగతనాలతో జల్సా లు చేద్దామంటే బేడీలు తప్పవు. మారిన ప్రపంచంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చట్టాల్లోనూ మార్పులు వస్తున్నాయి. మనం రాసుకున్న రాజ్యాంగంలోనే మార్పులు చేసుకుంటున్నాం. అలా చేసుకోకుంటే ముందుకు సాగలేం. నిర్భయ చట్టం వచ్చింది. ఎపిలో దిశ చట్టం తీసుకుని వచ్చారు. సైబర్ క్రైమ్ పెరుగుతున్న క్రమంలో అందుకు అనుగుణంగా చట్టాలను రూపొందించు కుంటున్నాం. ఇదే క్రమంలో రెవెన్యూ చట్టంలో కూడా మార్పులు రావాల్సి ఉంది. అందుకు శ్రీకారం చుట్టడం అవసరం. భూమిపై ఎంతో ఆశతో ప్రజలు పైసాపైసా కూడబెట్టి భూములు కొనుక్కున్న వారికి రక్షణ లేకుండా పోతున్న తరుణంలో తీసుకుని వచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ఆసాంతం సమగ్రంగా ఉందని అనకపోయినా అడుగు పడిందని మాత్రం చెప్పవచ్చు. ఇది తొలి అడుగు మాత్రమే అని సిఎం కెసిఆర్ కూడా చెప్పారు. ఇందులో ప్రధానంగా వక్ఫ్,దేవాదాయ భూములకు రక్షణఱ కల్పిస్తామని సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ నూటికి నూరుపాళ్లు అమలు కావాలి. దేవాలయ, వక్ఫ్ భూములను తక్షణం స్వాధీనం చేసుకోవాలి. కౌలుదారీ చట్టం పేరుతో బెదరించి, ఎమ్మార్వోలకు లంచాలు ముట్టచెప్పి పట్టాలు చేయించుకున్న వారి భరతం పట్టాలి. వేలాది ఎకరాల దేవాదాయ భూములను తక్షణం స్వాధీనం చేసుకోవడం ద్వారా ధూపదీప నైవేద్యాలకు కరువైన గుళ్లకు వెలుగు ప్రసాదించాలి. అలాగే హైదరాబాద్ నగరం నడిబొడ్డున వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకుని వైస్రాయ్ లాంటి హోటల్లు కట్టారు. ఇలాంటి భూములకు వందశాతం మార్కెట్ రేటు ప్రకారం పరిహారం రాబట్టాలి. ఇవన్నీ చేయగలిగితే సిఎం కెసిఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఇటీవల కొందరు వేతన జీవులు లేదా వ్యాపారులు తాము సంపాదించుకున్న దాంట్లో కొంత మిగుల్చుకుని గ్రామాల్లో భూములు కొని కౌలుకు ఇస్తూ వచ్చారు. ఇలాంటి భూములన్నీ ఇప్పుడు కోర్టు కేసుల్లో నలుగుతున్నాయి. కౌలుదారు తమదే భూమి అని కిరికిరి పెట్టి, బెదరించి పట్టాలు చేయించుకున్నవీ ఉన్నాయి. ఇలాంటి భూములకు పరిష్కారం చూపాలి. కాలమ్‌లో అనుభవదారు పాత్రను ఎత్తేయడం నిజంగా పెద్ద సంస్కరణగా భావించాలి. చట్టం రూపొందించిన క్రమంలో ఇప్పటి వరకు జరిగిన అనేకానేక కేసులకు సంబంధించి ఘటనలను ముందుకు వేసుకుని వాటిని పరిష్కరించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఉపాధి కోసం భూమిని దున్నుతామని వచ్చే కొందరు చివరకు యాజమాన్యాలను మోసం చేస్తున్న క్రమంలో ఈ చట్ట సవరణ ఓ మంచి నిర్ణయంగా తీసుకోవాలి. ఇకనుంచి భూమి ఎవరిదైతే వారిదే అన్న భరోసా రావాలి. సమగ్ర భూసర్వేలో ఇలాంటి లోపాలను గుర్తించి..పట్టాదారుకు న్యాయం కల్పించాలి. ప్రధానంగా దేవాదాయ,వక్ఫ్ భూములను తక్షణం స్వాధీనం చేసుకోవడం ద్వారా చట్టానికి ఉన్న ప్రాధాన్య తను తెలియచేయాలి. సిఎం కెసిఆర్ స్వయంగా అసెంబ్లీలో ఈ రెండు శాఖలకు చెందిన భూములపై ప్రస్తావించిన ందువల్ల అందుకు తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి భూ జగడాలకు చెక్ పెట్టాలని కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేస్తూ బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యం లో ఇకపై సరిహద్దు వివాదం శాశ్వతంగా అడ్డుకట్ట వేసే పరిస్థితులు కూడా రానున్నాయి. దీంతో గ్రామాల్లో చిన్నచిన్న గెట్టు వివాదాలు కూడా సమసిపోయేలా చేస్తామన్న హామీ మేరకు సర్వే నిర్వహించాలను కోవడం స్వాగతించాల్సిందేఉ. ముఖ్యంగా గ్రామాల్లో భూ సంబంధిత వివాదలకు రెవెన్యూ అధికారుల పనితీరే కారణమన్న విమర్శలు బలంగానే ఉన్నాయనడానికి అనేక సందర్భాల్లో రైతులు టవర్లెక్కి ఆందోళనలు చేశారు. మరీ ముఖ్యంగా రికార్డులు తారుమారు చేసి...పట్టాలో ఒకరి పేరు ఉంటే మరోకరిపె రాయటం కొకొల్లలుగా చోటు చేసుకున్నాయి. అంతేకాదు గ్రామాల్లో భూ యాజమానుల మధ్య వివాదాలను ఆసరాగా చేసుకొని ఒక వర్గం కొమ్ముకాయడంతో వివాదం మరింత రాజేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి అడుగగా ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు పట్టాల్లో ఉన్న వివరాల ఆధారంగా సమగ్ర భూ సర్వే చేసి హద్దులను శాశ్వతంగా చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంపై సానుకూల పవనాలు కన్పిస్తు న్నాయి. వాస్తవంగా గ్రామాల్ల చోటు చేసుకున్న వివాదాల్లో సింహ భాగం గెట్ల పంచాయతీ మాత్రమేనని చెబుతున్నారు. మారిన కాలానుగుణంగా చట్టాలను మార్చాలన్న సంకల్పం ప్రకటించిన సిఎం కెసిఆర్ చారిత్రాత్మక బిల్లుకు శ్రీకారం చుట్టారనే చెప్పాలి. కొత్త రెవెన్యూ చట్టంతో భూమి హక్కుదారులకు పూర్తి అండదక్కనుంది. నిజానికి గతంలో జమాబందీ కారణంగా పట్వారీల వ్యవస్థలో భూమి హద్దులు సక్రమంగా నిర్వహించారు. తదనంతరం వాటిని తుంగలో తొక్కిన కొందరు అధికారులు పంచాయితీలకు తెరలేపారు. దశాబ్దాల క్రితం పభుత్వం నిర్ణయించిన హద్దులు కనుమరుగయ్యాయి. దీంతో ఒకరి భూమిలో మరొకరు చొచ్చుక రావడం వల్లనే పల్లెల్లో ఘర్షణ పూరిత వాతావరం నెలకొంటున్నట్టు ప్రభుత్వం చేయించిన అధ్యాయనంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే 2017 ప్రభుత్వం వ్యూహాత్మకంగా భూరికార్డుల ప్రక్షాళన చేపట్టింది. ప్రస్తుతం రికార్డుల ప్రక్షాళన పూర్తి కావడంతో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో వీరి అవసరం లేకుండా శాశ్వతంగా శాస్త్రీయ పద్ధతులో భూములను కొలిచి రికార్డు చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయిం తీసుకునే అవకాశం ఏర్పడింది. అది జరిగితే భూ సంబంధిత జగడాలకు పూర్తి స్థాయిలోనే చెక్ పెట్టేట్టు అవుతుందని నిపుణులు అంచనాలు వేస్తున్నారు. అంతేకాదు అనుభవం ఉన్ననిపుణులతోనే సర్వే చేయిస్తే తప్ప ప్రభుత్వ లక్ష్యం నేరవేరే అవకాశం లేదు. తెలంగాణ ప్రాంతంలో ఒక్కొక్క చోట ఒక్కొరకంగా భూములను కొలిచే పద్ధతి ఉంది. కొన్ని చోట్ల సెంట్ల పద్ధతిన భూములను కొలుస్తుండగా మరి కొన్ని చోట్ల గుంటల చొప్పున లెక్క కడుతు న్నారు. అదే సమయంలో 1990 వరకు కొలతల కోసం ఉపయోగించిన టిప్పన్లకు, ప్రస్తుతం ఉపయోగి స్తున్న టీపన్లకు తేడాలు స్పష్టంగా ఉన్నాయి. అదీ కాకుండా గతంలో ఏయే ప్రాతిపాదికన హద్దులు నిర్ణయించారో సమగ్రంగా అధ్యాయనం చేసిన తర్వాతే క్రమ పద్ధతిలో సర్వే చేయాలని నిపుణులు చెబుతున్నారు. అలా కాకుండా మొక్కుబడిగా సర్వే జరిపి హద్దులు నిర్ణయిస్తే మళ్లీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. అలా చేయడం ద్వారా ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలి. కెసిఆర్ నిర్ణయం కూడా సాకారం కావాలి. అయితే ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన భూ సర్వే పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుంది. తూతూమంత్రంగా కాకుండా చెక్ పెట్టగలగాలి.

జూడాలతో చర్చలు సఫలం

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): ఉస్మానియా జూనియర్ డాక్టర్లతో సూపరింటెండెంట్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రిలో గత నాలుగు రోజులుగా తాము చేస్తున్న సమ్మెను.. విరమిస్తున్నట్టు జూడాలు ప్రకటించారు. ఆపరేషన్ థియేటర్స్ సమస్య పరిష్కరించేందుకు సూపరింటెండ్ అంగీకరించారు. ఆపరేషన్ థియేటర్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అంగీకారం తెలిపారు. అయితే నాలుగు రోజులుగా ఉస్మానియా ఆసుపత్రిలో పీజీ వైద్య విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. ఉస్మానియాలో సూపరింటెండెంట్ ఛాంబర్‌ను పీజీ విద్యార్థులు ముట్టడించారు. తక్షణమే ఆపరేషన్ థియేటర్‌లు ఏర్పాటు చేయకపోతే ఎమర్జెన్సీ సర్వీసులు నిలిపివేస్తామని విద్యార్థులు చెబుతున్నారు. అనాలోచిత నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి ఉస్మానియా హాస్పిటల్‌కి ఎదురైందని విద్యార్థులు చెబుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

-8గేట్లు ఎత్తిన అధికారులు

నాగర్ కర్నూల్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): ఆగష్టులో కురిసిన భారీ వర్షాలకు కృష్ణానదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిండుకుండలను తలపిస్తున్నాయి. కర్ణాటకలో రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు లక్షా 22 వేల క్యూసెక్కులపైగా ఇన్ఎ÷-లో వస్తుండగా దిగువకు లక్షా 20 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇటు తుంగభద్ర నుంచి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయానికి 2 లక్షల 89వేల క్యూసెక్కుల ఇన్‌ప్లో వచ్చి చేరుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా దిగువ నాగార్జున సాగర్‌కు 2 లక్షల 22 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.50 అడుగులు (212.91 టీఎంసీలు)గా ఉంది. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 31 వేల క్యూసెక్కులు వస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి లక్షా 73 వేల క్యూసెక్కులు వస్తుండటం.. ఇప్పటికే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా లక్షా 56 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.50 అడుగులు (311.55) టీఎంసీల నీరుంది. జల విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ, కుడి కాల్వ ద్వారా 34 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ : మందుల సామేలు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 12 : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ముఖ్యమంత్రి కేసిఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆదుకుంటున్నారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేలు అన్నారు. శనివారం అడ్డగూడూర్ మండలంలోని స్వగ్రామం ధర్మారంలో మందుల సామేలు మీడియాతో మాట్లాడారు. వీఆర్‌వో వ్యవస్థ రద్దు , నూతన రెవిన్యూ బిల్లు ఆమోదంతో గ్రామ గ్రామాన రైతులు సంబురాలు జరుపుకుంటూ ఆనందంగా ఉన్నారన్నారు. తుంగతుర్తి నియె?జకవర్గం కాలేశ్వరం జలాలతో సస్యశ్యామలం అయిందన్నారు. కాగా మె?త్కూర్, అడ్డగూడూర్ మండలాలకు బునాదిగానికాల్వ, పిలాయిపల్లి, ధర్మారం కాల్వలు పూర్తి చేసి బస్వాపురం రిజర్వాయర్ ద్వారా సాగు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు.

ధర్మారం పొలిమేరలో బిక్కేరు వాగుపై రూ. 8 కోట్ల 50 లక్షల 40 వేల వ్యయంతో చెక్ డ్యామ్ మంజూరు అయిందని చెప్పారు. ఈ వాగుకు నీరు రావడంతో అడ్డగూడూర్ మండలంలో సుమారు 7 వేల ఎకరాలు సాగులోకి వచ్చింది అన్నారు. అలాగే ధర్మారం చెరువును రిజర్వాయర్‌గా చేస్తే ధర్మారం, లక్ష్మీదేవికాల్వ గ్రామాలలో 4 వేల ఎకరాలకు నీరు పారుతుందన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం జ్యోతి రాములు, టీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తాడోజు లక్ష్మణాచారి. వార్డు సభ్యులు మందుల సువర్ణజాని జక్కుల బాగ్యరావు, టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోలినేని సోమయ్య, యూత్స్లు మందుల స్తెదులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మందుల విజయ్, నాయకులు సంద అంజయ్య కత్తుల నరేష్, కప్పల కనకయ్య, మేకల పద్మయ్య, బండారి వీరయ్య, బాల్నె బిక్షం తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల ప్రక్షాళన తరవాతే కొట్లాటలు

సమస్యలను పరిష్కరించేలా కార్యాచారణ రావాలి
పట్టాదారులకు పూర్తి రక్షణతో దక్కనున్న భరోసా
సమాంతర నిఘా పెట్టకపోతే చట్టానికి తూట్లు తప్పవు

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం పెద్ద ఎత్తున భూ వివాదాలు తెరపైకి వచ్చాయి. ఈ వివాదాలను పరిష్కరించడం కోసం ప్రత్యేక ట్రి బ్యూనల్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ సైతం వినిపించింది. ముఖ్యంగా ప్రక్షాళన తర్వాత భూ యాజమాన్య హక్కుల విషయంలో చాలా సమస్యలు వచ్చాయి. దశాబ్దాల క్రితం భూములు విక్రయించిన పట్టేదార్ల పేర్లు తిరిగి సర్వేలో బయటకు రావడం, వారి పేర్లనే పట్టేదార్లుగా నమోదు చేయడం వంటి వివాదాల తలెత్తాయి. అలాగే ఒకరి సర్వే నెంబర్లుగా ఉన్న భూమిని మరొకరి సర్వే నెంబరుకు మార్చడం అందులో కొంత, ఇందులో కొంత చూపించడం వంటి చిత్రాలు చోటు చేసుకున్నాయి. మొదటితరం భూ సంస్కరణల్లో వాస్తవ సాగుదారుకు, పన్నులు వసూలు చేసే ప్రభుత్వానికి మధ్య ఉన్న వివిధ రూపాలలోని భూ యజమానులను తొలగించే పని చేపట్టారు. ఇప్పుడు భూ సంస్కరణల్లో ప్రభుత్వం భూ యజమానులకు, ప్రభుత్వానికి,కౌనుగోలుదారులకు మధ్య ఉన్న సాగుదార్లను తొలగించే పనికి శ్రీకారం చుట్టింది. భూ లావాదేవీల సరళీకరణ, కంప్యూటరీకరణ అన్నది పారదర్శకంగా సాగేలా సమాంతరంగా మరో వ్యవస్థ పనిచేయాలి. భూమి యజమానికి టైటిల్ డీడ్, వారు సాగు చేస్తున్న విస్తీర్ణానికి పాసుపుస్తకం ఇచ్చేవారు. ఇప్పుడు ఆ రెండిటినీ కలిపివేసి కేవలం 'టైటిల్ డీడ్ కమ్ పాసుపుస్తకంగా మార్పు చేశారు. ఇక నుంచి భూమికి ఒకరే హక్కుదారు అంటే ఎవరిది భూమి అయితే వారిదే. మారిన కాలంలో ఈ రక్షణ రావడం అన్నది విప్లవాత్మక మార్పుగా చూడాలి. నిజానికి సాగుదారు అన్నది కేవలం పనిచేసుకుని పంటపండించుకుని ఉపాధి పొందాలి. కానీ తానే హక్కుదారు అన్న పేచీ పెట్టడంతోనే భూముల పంచాయితీ వస్తోంది. అలా అనేకానేక సందర్భాల్లో వేల కేసులు పుట్టుకు వచ్చాయి. పట్టణాల్లో స్థిరపడ్డ వారు లేదా..పల్లెల్లో తరతరాలుగా భూములు ఉన్న వారు ఎవరో ఒకరికి కౌలుకు ఇచ్చి ఉద్యోగాలు చేస్తూ ఉన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో విఆర్‌వోలను, ఎమ్మార్వోలను పట్టుకుని భూములను ఖాస్తుదారు ఖాతాలో వేయేంచేసుకున్నారు. తెలంగాణ భూమి హక్కులు, పాసుపుస్తకాల బిల్లు -2020ను ముఖ్యమంత్రి బాగా ఆలోచన చేసి రూపొందించినట్లు కనిపిస్తోంది. అయితే ఇదే సందర్భంలో అనేక ప్రశ్నలు ఉదయిస్తున్న వేళ తొలి అడుగు మాత్రమే అన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న చట్టంతో పోలిస్తే ముఖ్యమైన మార్పులు చోసుకున్నాయి. రిజిస్ట్రేషన్, పట్టా జారీ అధికారాలను తహశీల్దారు చేతిలో పెట్టడం, రెవెన్యూ కోర్టుల స్థానంలో ట్రిబ్యునళ్లను పెట్టడం, భూమి రికార్డులను ఎలక్ట్రానిక్ రూపంలో నవోదు చేయడానికి, భద్రపరచడానికి, మార్పులు చేయడానికి, జారీ చేయడానికి చట్టబద్ధత కల్పించ,డం; టైటిల్ డీడ్ పట్టా పాసుపుస్తకం జారీ పక్రియ సమయాన్ని తగ్గించడం వంటివి మార్పులకు శ్రీకారంగా చూడాలి. అయితే ఈ పక్రియలో పేదల కష్టాలన్నీ తీరిపోతాయని, రెవెన్యూ వ్యవస్థలో అవినీతి మటుమాయం అయిపోతుందనే భావన ఉండరాదు. చట్టాలు ఎన్ని చేసినా వాటిని వమ్ముచేసేందుకు కొందరు మార్గాలు వెతుకుతూనే ఉంటారు. అలాంటి వారికి అవకశాం లేకుండా చేయగలగాలి. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన సమయంలో ముఖ్యమంత్రి తన సంకల్పాన్ని ప్రకటించినా..అవి సక్రమంగా నెరవేరలేదని తదుపరి జగడాలు చెప్పాయి. రికార్డుల ప్రక్షాళన జరిగిన తరువాతే ఇంకా అవినీతి పెరగడంతో పాటు, సాధారణ రైతులు,భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాలు బయటకు వచ్చాయి. ఇది సిఎం కెసిఆర్ ఆలోచనలకు పూర్తి భిన్నంగా సాగింది. అందువల్ల చట్టాలను పక్కాగా అమలు చేసే వ్యవస్థను నెలకొల్పాలి. పాసుపుస్తకాల జారీ అధికారంతోనే తహశీల్దార్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్న క్రమంలో ఇప్పుడు రిజిస్ట్రేషన్ అధికారం కూడా వారికే కట్టబెట్టడం ద్వారా అనుమానాలు మరింత బలపడుతున్నాయి. రెవెన్యూశాఖలో అవినీతి మరిన్ని రెట్లు పెరుగుతుందని సభలో పలువురు తమ సందేహాలు వ్యక్తం చేశారు. భూ లావాదేవీలు, రికార్డులు, కంప్యూటరీకరణ ద్వారా భూమి సమస్యలు పరిష్కారం కావాలి. అందుకు పక్కాగా ప్రణాళిక చేయాలి. పేదల భూములు, రికార్డులలో సమస్యాత్మక లోపాలున్న భూములకు సంబంధించి జరిగిన కుంభకోణాలు బద్దలు కావాలి. నిజానికి తెలంగాణలో పెద్దఎత్తున భూమాఫియా తయారయింది. వారిపై కన్నేసి సామాన్యులకు అండగా సర్కార్ నిలవగలగాలి. ఎందుకంటే సామాన్యులు రోజువారీగా తమ భూమి ఉందో లేదో కంప్యూటర్లలో, స్మార్ట్‌ఫోన్లలో తనిఖీ చేసుకోరు. కేవలం భూమి సాగు చేసుకుంటూ ఉంటారు. కాని వాళ్ల భూమికి కంప్యూటర్లలోనే రెక్కలు వచ్చి ఎగిరిపోతే సర్కార్ సంకల్పం నెరవేరదు. తమ భూమి తమది కాదన్న విషయం వాళ్లకు తెలిసేసరికి వేరేవారి పేరు మీద పట్టాలు లేకపోగా వివాదాలతో మళ్లీ కోర్టు గడపలు తొక్కాల్సి వస్తుంది. ఇంక వాటిని అధిగమించి తమ భూమిని కాపాడుకోవడం వాళ్లకు ఒక జీవన్మరణ పోరాటమే అవుతుంది.

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సేవలందిస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఉచితంగా పీపీఈ కిట్లు, షూ, టోపీలు అందించి, ఉత్తమ శానిటేషన్ వర్కర్స్‌కు ప్రశంసా పత్రాలను అందజేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమాం

శానిటేషన్ సిబ్బందికి ఉచితంగా పీపీఈ కిట్స్

ఖమ్మం, సెప్టెంబర్ 12 : ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సేవలందిస్తున్న శానిటేషన్ సిబ్బంది పట్ల రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ మానవతా హృదయం చాటుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బంది అందరికి మంత్రి ఉచితంగా పీపీఈ కిట్లు, షూ, టోపీలు అందించారు. ఉత్తమ శానిటేషన్ వర్కర్స్ కు ప్రశంసా పత్రాలను మంత్రి అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి అని పేర్కొన్నారు. ప్రజారోగ్యం కోసం కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య పరమైన సదుపాయాలు కల్పించేందుకు, వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ఖమ్మం నగరాన్ని ఈ కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, మేయర్ డాక్టర్ పాపాలాల్, కమిషనర్ అనురాగ్ జయంతి, జిల్లా పరిషత్ చైర్మన్ కమల్ రాజు, డిసిసిబి డిసిఎంఎస్ చైర్మన్ లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చినజీయర్ స్వామి మాతృమూర్తి కన్నుమూత

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): త్రిదండి చినజీయర్ స్వామికి మాతృవియోగం కలిగింది. చినజీయర్ స్వామి తల్లి అలివేలుమంగ(85) కన్నుమూశారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. దీంతో చినజీయర్ స్వామి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తల్లి మరణాన్ని స్వామి తట్టుకోలేకపోతున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శంషాబాద్ ముచ్చింతల్‌లోని చినజీయర్ ఆశ్రమం సమీపంలో అలివేలుమంగ అంత్యక్రియలు జరగనున్నాయి. ఆమె మరణవార్తను తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆశ్రమానికి చేరుకున్నారు. పారిశ్రామికవేత్త జె.రామేశ్వర రావు తదితరులు ఆమె భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. సిఎం కెసిఆర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

భావితరాలకు నైతిక విలువలతో కూడిన విద్య

-ఉపరాష్ట్రపతి వెంకయ్య ఆశాభావం

న్యూఢిల్లీ,సెప్టెంబర్11(ఆర్ఎన్ఎ): నైతిక విలువలతో కూడిన విద్యను భావితరాలకు అందించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రేపటి తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తోందని.. వాటితో పాటు విలువల ఆధారిత విద్యావ్యవస్థను కొనసాగించాలన్నారు. ఐక్యరాజ్యసమితి సమాచార కేంద్రం భారత్, భూటాన్ భాగస్వామ్యంతో శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హార్ట్‌ఫుల్‌నెస్ ఎస్సే ఈవెంట్ 2020'ని ఉపరాష్ట్రపతి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ.. వసుధైక కుటుంబ విధానంతో భారతావని ముందుకెళ్తోందన్నారు. ఇతరుల కోసం జీవిస్తే ఎక్కువకాలం జీవిస్తామని చెప్పారు. కరోనా కష్టకాలాన్ని యావత్ ప్రపంచం త్వరలోనే అధిగమిస్తుందని వెంకయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

రెవెన్యూ కోర్టుల ఎత్తివేతపై సందేహాలు

-మళ్లీ కోర్టుల చుట్టూ తిరగడంతో రైతులకు నష్టమే

ఆదిలాబాద్,సెప్టెంబరు12 (ఆర్ఎన్ఎ): ప్రభుత్వం తీసుకువస్తున్న రెవెన్యూ కొత్త చట్టంపై భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సన్న, చిన్నకారు రైతులు ఈసారైనా భూ ఆక్రమణలు ఈ చట్టంలో తగ్గుతాయని భావిస్తున్నారు. మరికొందరు మాత్రం ఈ కొత్త చట్టం బడాబాబులకు అనుకూలంగా ఉంటుందని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ కోర్టులు తీసివేతపై కూడా భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గతంలో తహసీల్దార్ తప్పు చేస్తే ఆర్డీవోకు లేదంటే జేసీ కోర్టులో అప్పీల్ చేసుకునేవారు. రెవెన్యూ అధికారుల వద్ద రికార్డు ఉండటంతో అప్పటికప్పుడు వాటిని చూసి తప్పులను సరి చేస్తుండేవారు.

కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా తప్పు జరిగితే పై అధికారులకు తెలుస్తుందని కొంతలో కొంత భయంతో పని చేస్తుండేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం రెవెన్యూ కోర్టులను ఎత్తివేసి ప్ర స్తుతానికి ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత నుంచి రెవెన్యూ కోర్టులో కాకుండా సివిల్ కోర్టులో భూ సమస్యలు పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాలంటే ఖర్చుతో కూడుకున్న పనితో పాటు ఏళ్ల తరబడి తిరగాల్సి వస్తుంది. కొత్త చట్టం ప్రకారం ప్రస్తుతం భూమి ఎవరి పేరుమీద ఉంటే వారికే చెందుతుందనే విధంగా ఉంది. దీంతో కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. భూ అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పేద ప్రజలకు న్యాయం చేకూర్చాలని ఆలోచనతో ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త రెవెన్యూ చట్టంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొత్త బిల్లుతోనైనా భూ అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందా, పేద ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందా అని చర్చించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వీఆర్‌వోలతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రభుత్వం ఆ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడంతో పాటు వీఆర్‌ఏలను కూడా అవసరం ఉన్నవారిని ఉపయోగించుకుని, మిగిలినవారిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించారు.

రాజీవ్ రహదారి మార్గంలో మొక్కల సంరక్షణ చేపట్టాలి

-తక్కువ ఎత్తు పెరిగే మొక్కలను పెంచాలి: కలెక్టర్

కరీంనగర్,సెప్టెంబరు12(నేటినిజం ప్రతినిధి): రాజీవ్ రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత అధికారులదే అని జిల్లా కలెక్టర్ కె శశాంక అన్నారు. మొగ్దుంపూర్ నుంచి కరీంనగర్ వరకు రాజీవ్‌రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరెంట్ వైర్ల కింద పూలు, తక్కువ ఎత్తు ఎదిగే మొక్కలను నాటాలని అన్నారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని అన్నారు.

జిల్లా గ్ర

రెవెన్యూ చట్టం రాబోతున్న తరుణంలో బయటపడ్డ అవినీతి

మెదక్ భూముల వ్యవహారంపై లోతుగా ఎసిబి విచారణ
ఆనాటి కలెక్టర్ తీరుపైనా అనుమానాలు?

మెదక్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): ఓవైపు రెవెన్యూ చట్టం అసెంబ్లీకి ముందుకు రాబోతున్న తరుణంలో మెదక్ జిల్లాలో వెలుగు చూసిన భూ కుంభకోసం రెవెన్యూ శాఖలో అవినీతిని బట్టబయలు చేసింది. కీసర నాగరాజ్య వ్యవహారం మరవక ముందే సబ్ కలెక్టర్ స్థాయి అధికారి పెద్దమొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిన తీరు రెవెన్యూ లోపాలను ఎత్తి చూపింది. దీంతో ఇప్పుడు ఈ కేసులో ఎసిబి లోతుగా విచారణ చేపట్టింది. మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ విషయంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేవలం 10 రోజుల వ్యవధిలో ఈ వ్యవహారానికి ముగ్గురు అధికారులు ఆమోదం తెలపడం వెనకాల మతలబేంటో తేల్చే పనిలో పడ్డారు.

అలాగే తహసిల్దార్ మాలతి సెలవులో వెల్లడం, ఆనాటి కలెక్టర్ ధర్మారెడ్డి ఆమోదం తెలపడం లాంటి అంశాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఏం జరింగిన్నది లోతుగా ఆరా తీస్తున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామంలోని సర్వే నంబర్లు 58, 59లో ఉన్న 112.21 ఎకరాల భూమికి ఎన్వోసీ ఇచ్చేందుకు పెద్దమొత్తంలో లంచం తీసుకుంటూ అదనపు కలెక్టర్ నగేశ్ అడ్డంగా దొరికిపోయిన విషయం రాష్ట్రం నివ్వెర పోయేలా చేసింది. ఏసీబీ అధికారులు ఈ కేసులో నగేశ్‌తోపాటు నర్సాపూర్ ఆర్డీవో అరుణారెడ్డి, చిల్‌పచెడ్ తహసీల్దార్ సత్తార్, జూనియర్ అసిస్టెంట్ వసీం, నగేశ్ బినామీ జీవన్‌గౌడ్‌ను అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఈ ఏడాది జూలై 21న నిరభ్యంతర పత్రం కోసం ఈ ఫైలు తహసీల్దార్ కార్యాలయానికి రాగా అదే రోజున తహసీల్దార్ మాలతి 11 రోజులు సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన చిల్‌పచెడ్ తహసీల్దార్ సత్తార్ రెండు రోజుల్లో ఫైల్‌ను ఆమోదించి జూలై 23న ఆర్డీవో కార్యాలయానికి పంపించారు. అక్కడా వారం రోజుల్లోనే ఆవోద ముద్రపడింది. జూలై 31న కలెక్టర్ కార్యాలయానికి చేరింది. అదే రోజు అప్పటి కలెక్టర్ ధర్మారెడ్డి స్టాంపులు, రిజిస్ట్రేన్ల శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. చిప్పలతుర్తి గ్రామంలోని సర్వే నంబర్లు 58, 59లో ఉన్న 112.21 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలనేది అందులోని సారాంశం. అదేరోజు ధర్మారెడ్డి పదవీ విరమణ పొందారు. అన్ని పత్రాలూ సవ్యంగా ఉన్నా నెలల తరబడి మ్యుటేషన్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించే అధికారులు, ఈ కేసులో ఇంత వేగంగా ఎలా ఫైళ్లను కదిలించారనే కోణంపై ఏసీబీ అధికారులు దృష్టిసారించారు. ధర్మారెడ్డిని కూడా విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ అంశంపై తనను సంప్రదించిన విలేకరులకు ధర్మారెడ్డి వివరణ ఇచ్చారు. తాను 58, 59 సర్వే నంబర్లలోని వేరే 112.21 ఎకరాలపై లేఖరాశానని.. ఈ కేసుతో ముడిపడి ఉన్న భూములకు సంబంధించి కాదని చెప్పారు. చిప్పలతుర్తి భూములకు ఎన్వోసీ కోసం దరఖాస్తు వచ్చిన రోజే తహసీల్దార్ మాలతి సెలవు పెట్టడానికి కారణమేంటని, ఎవరైనా ఒత్తిడి తెచ్చారా అనే కోణంపై ఏసీబీ అధికారులు ఆమెను ప్రశ్నించారు. నిజానికి ఇన్‌చార్జి తహసీల్దార్లు ఇలాంట్గి ÷ళ్లై జోలికి వెళ్లరు. కానీ, సత్తార్ మాత్రం తాను బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోన్నే ÷ల్‌ను ఆమోదించి, ఆర్డీవో కార్యాలయానికి పంపారు. 11 రోజులపాటు సెలవు విషయంలో మాలతిని ఇదే కోణంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. నగేశ్ వద్ద పనిచేసిన ఉద్యోగులను కూడా ఏసీబీ అధికారులు విచారించారు. ఓ సీసీని సోదాల సమయంలో నగేశ్ ఇంటికే పిలిపించుకుని.. మాలతి సెలవుతోపాటు వలు అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. మరో సీసీని ఫోన్‌లో విచారించినట్లు తెలిసింది. మొత్తంగా ఈ వ్యవహారంలో ఆనాటి కలెక్టర్ ధర్మారెడ్డి పాత్ర ఉందా అన్నది కూడా విచారణ చేయిస్తున్నారు.

ధిక్కార స్వరాన్ని సహించని వారసత్వం

ఆజాద్ మార్పు వెనక ఆంతర్యం ఇదే
రానున్న కాలంలో మళ్లీ రంగంలోకి రాహుల్ టీమ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీలో కీలకమైన వర్కింగ్ కమిటీని పునర్వ్యవస్థీకరించడం ద్వారా అసమ్మతి గళాన్ని సహించబోమన్న హెచ్చరికను వంశపారంపర్యనాయకత్వం పంపింది. కాంగ్రెస్ పార్టీలో కుటంబగతంగానే పార్టీ ఉంటుందని, వారి కనుసన్నల్లోనే కార్యక్రమాలు సాగుతాయని సూచించింది.

ఇటీవల గులాంనబీ ఆజాద్ తదితరులు రాసిన లేక పర్యవసానంగా పార్టీలో వారి ప్రాధాన్యం తగ్గింది. ఎదరిస్తే మీ సంగతి ఇంతే అని తేల్చేశారు. దీనికితోడు మళ్లీ రాహుల్ పగ్గాలు చేపడతారన్న సంకేతాల మేరకు పాతవారిని తొలగించే ప్రక్రియ ప్రారంభమైందని తెలుస్తోంది. మొత్తంగా శుక్రవారం చేపట్టిన మార్పులు భవిష్యత్ మార్పులకు పునాదిగా చెబుతున్నారు. పార్టీని సంస్థాగత ప్రక్షాళన చేయాలని, పూర్తిస్థాయి నాయకత్వం ఎన్నుకోవాలంటూ... ఇటీవల సీనియర్లు రాసిన లేఖతో కాంగ్రెస్‌లో ప్రకంపనలు రేగాయి. లేఖ వివాదం ముగిసిన కొన్ని రోజులకు పార్టీలో మార్పులు చేసిన అధిష్ఠానం... దానికి నేతృత్వం వహించిన ఆజాద్‌కు పదవుల్లో కోతేసింది. ఆయన్ను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది. ఒక్కడిపైనే చర్యలు తీసుకోకుండా మరికొందరిపైనా చర్యలు తీసుకుంది. మొత్తానికి పార్టీలో యువరక్తం ఎక్కించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఎంతమేరకు సఫలమవుతాయో చూడాలి. పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలిగా ఉన్న సీడబ్ల్యూసీలో సోనియా గాంధీ సహా 22 మంది సభ్యులు ఉండనున్నారు. 26 మంది శాశ్వత సభ్యులు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులతో పార్టీ అధిష్ఠానం జాబితాను విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా ప్రియాంక గాంధీ కొనసాగనున్నారు. పార్టీలో సీనియర్ నేత రణ్‌దీప్ సూర్జేవాలాకు మంచి అవకాశం దక్కింది. కాంగ్రెస్ అధినేత్రికి సలహా ఇచ్చే ఆరుగురు సభ్యుల కమిటీలో ఆయన చోటు సంపాదించారు. ఈ ప్రక్షాళనలో సీనియర్ నేత గులాం నబీ ఆజాద్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించారు. సీడబ్ల్యూసీలో ఆయన్ను కొనసాగించినప్పటికీ.. హరియాణా ఇన్‌ఛార్జిగా ఆయన స్థానంలో వివేక్ బన్సల్‌ను నియమించారు. ఆజాద్‌తో పాటు అంబికా సోనీ, మోతీలాల్ ఓరా, మల్లిఖార్జున ఖర్గేలను సైతం పార్టీ ప్రధాన కార్యదర్శి పదవుల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 24న సీడబ్ల్యూసీ సమావేశం నిర్ణయాలను అనుసరించి.. సంస్థాగత వ్యవహారాలు పర్యవేక్షించేందుకు ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో అంబికా సోనీతో పాటు ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, కేసీ వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్, రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఉంటారు. ఇక, రెండు తెలుగురాష్ట్రాలకు ఇంఛార్జులను మార్చారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా ఉన్న ఆర్సీ కుంతియా స్థానంలో తమిళనాడు ఎంపీ మాణికం ఠాకూర్‌ను పార్టీ నియమించింది. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ ఉండనున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎంపీ చింతామోహన్‌కు సీడబ్ల్యూసీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా అవకాశం లభించింది.

పట్టభద్ర ఎమ్మెల్సీ కోసం ఇప్పటి నుంచే పైరవీలు

కాంగ్రెస్‌లో సీటు కోసం నేతల్లో పెరుగుతున్న పోటీ
మరోమారు సీటు దక్కించుకునే వ్యూహంలో బిజెపి

మహబూబ్‌నగర్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేడి రాజుకుంటోంది. వచ్చే ఏడాది మార్చిలో ఎమ్మెల్సీ ఎలక్షన్ జరగనుంది. ప్రస్తుతం ఈ స్థానంలో సభ్యుడిగా ఉన్న బీజేపీ నేత రామచంద్రరావు పదవీకాలం అప్పటితో ముగియనుంది. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకే గ్రాడ్యుయేట్లు పట్టం కట్టారు. ఈసారి దాదాపు ఐదున్నర లక్షల మందికిపైగా ఓటర్లు పేర్లు నమోదు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్సీ స్థానం కావడంతో ప్రధాన పార్టీలు ఎలాగైనా పట్టు సాధించాలని చూస్తున్నాయి. ఇదే జోష్ ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ కనిపిస్తోంది. మరోమారు రంగంలోకి దిగేందుకు బిజెపి కూడా సై అంటోంది. పాలమూరు జిల్లా కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారపార్టీకి వ్యతిరేక ఫలితాలు రావడంతో.. మళ్లీ అదే జరుగుతుందన్న ఆశల్లో వారు ఉన్నారు. దాంతో టికెట్ ఆశించే వారి జాబితా పెరిగిపోతోందట. అసెంబ్లీ ఎన్నికల్లో వెనకబడ్డ మాజీ ఎమ్మెల్యేలు ఏదో విధంగా ఎమ్మెల్సీ అయి.. చట్టసభలో అడుగుపెట్టాలని ఉబలాటపడుతున్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు చాలా మంది పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. రేస్‌లో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపొందడంతో.. ఇక్కడ కూడా కాస్త కష్టపడితే ఎమ్మెల్సీ స్థానం కాంగ్రెస్ గెలుచుకుంటుందని వారు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, సీనియర్ న్యాయవాది వెంకటేశ్‌లు పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే సంకేతాలు పంపారు. ఇందులో చిన్నారెడ్డి, వంశీచంద్ రెడ్డి ముందు వరసలో ఉన్నారు. వీరికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కాంగ్రెస్ నేతల నుంచి పోటీ ఉంది. మాజీ ఎమ్మెల్యేలు కిచ్చనగారి లక్ష్మారెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి సైతం పోటీ చేయాలని ఆసక్తితో ఉన్నారని తెలుస్తోంది. వీరంతా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారే. ఈ రకంగా అయినా మరోమారు తమ అదృష్టం పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసం అధిష్టానం టికెట్ ఎవరికి ఇస్తుందన్నది చూడాలి. అయితే ఇప్పటి నుంచే టికెట్ రిజర్వ చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఎవరినైనా అభ్యర్థిని ప్రకటిస్తుందా లేదా అన్నది చూడాలి. అంతా కలిసి పార్టీ విజయం కోసం ఒకరిని బరిలో దించితే సరి.. లేదంటే ఎవరికి వారుగా బరిలో దిగితే ఓట్ల సమీకరణాలు మరిపోయే అవకాశం ఉంది. పరిస్థితి చూస్తుంటే రానన్న రోజుల్లో పోటీకి మరికొంత మంది ముందుకొచ్చే వీలుంది. ఇకపోతే మరోమారు పట్టు నిలుపుకోవాలనిబిజెపి భావిస్తోంది. టిఆర్ఎస్ ఎవరిని నిలుపుతుందన్నది కూడా ఆసక్తిగా మారింది.

కెసిఆర్ ఖాతాలో వేస్తేనే కేంద్ర సాయం అందినట్లా?

పేదల అకౌంట్లో డబ్బులు వేస్తే కానరావడం లేదా
ఆయుష్మాన్ భారత్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు
సిఎం కెసిఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): కరోనా సమయంలో తెలంగాణకు కేంద్రం సాయం చేయడం లేదన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యల్ని ఖండిస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రజలకు హక్కుగా వచ్చే అన్ని వనరులను కేంద్రం అందిస్తోందని, కేంద్రానికి ఏ ప్రాంతం, ఏ రాష్ట్రంపై పక్షపాతం లేదని చెప్పారు. ఆత్మనిర్భర భారత్‌లో లబ్ధి పొందిన రైతులు, మహిళలు, కార్మికులు తెలంగాణ బిడ్డలు కాదా? అని ప్రశ్నించారు. వారి అకౌంట్లో డబ్బులు వేస్తే తెలంగాణ బిడ్డలకు ఇచ్చినట్లు కాదా? కేసీఆర్ అకౌంట్ లో వేస్తేనే తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినట్లు అవుతుందా? అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, పథకాలకు కేంద్ర సంస్థలే అప్పులు ఇస్తున్నాయన్న విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రానికి 13 లక్షల 85 వేల ఎన్ 95 మాస్క్ లు, 2 లక్షల 41 లక్షల పీపీఈ కిట్లు, 42 లక్షల హెచ్ సీక్యూ ట్యాబ్ లెట్లు, రెండు లక్షల ఆర్ఎన్ఏ టెస్ట్ కిట్లు, 3 లక్షల 12 వేల పీసీఆర్ కిట్లను ఇచ్చామని మంత్రి చెప్పారు. 14 వందల వెంటిలేటర్ల కేటాయిస్తే.. కేవలం 647 వెంటిలేటర్లనే ఇచ్చామని కేసీఆర్ చెప్పడం సరికాదని అన్నారు. దాదాపు 500 వెంటిలేటర్లకు ఇంకా సీల్ కూడా తీయలేదని మండిపడ్డారు. మజ్లీస్ మెప్పు కోసం మోడీపై దుమ్మెత్తి పొసే ప్రయత్నం చేయొద్దని చురకలంటించారు. సీఎం పనికి రాని పథకం అంటున్న ఆయుష్మాన్ భారత్‌ను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని అన్నారు. పనికొచ్చే ఆరోగ్యశ్రీ లో తెలంగాణ ప్రజలకు కరోన ట్రీట్మెంట్ ను ఎందుకు చేర్చలేదని ప్రశ్నిస్తూ.. కరోనా వచ్చి ఆరు నెలల అయ్యాక ఆరోగ్యశ్రీ గుర్తు వచ్చిందా అని అడిగారు. రాష్ట్రం ఏర్పడ్డాకా ఇంత వరకు కొత్త రేషన్ కార్డు లు ప్రింట్ చేయలేదన్నారు. కార్డుల పై కేంద్ర ప్రభుత్వం లోగో వేయాల్సి వస్తుందని ప్రింట్ చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ కిట్స్‌లో కేంద్రం 6 వేలు ఇస్తుందని.. ఆ కిట్స్ పై మోడీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కు సచివాలయం పై ఉన్న శ్రద్ధ.. కోవిడ్ పై ఉంటే బాగుండేదని విమర్శించారు. పారాసిటమల్‌తో కరోనా తగ్గుతుందన్న సీఎంకు కేంద్రాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల నుండి ఎన్ని లోన్స్ తీసుకున్నారో సీఎం చెప్పాలన్నారు. లేదంటే తాను సీఎం కి వివరాలు ఇచ్చేందుకు సిద్ధమని, తాను చెప్పిన దాంట్లో అవాస్తవాలు ఉంటే నిరూపించాలని అన్నారు. 'కేసీఆర్ కిట్', బస్తీ దవాఖానాల్లోనూ కేంద్ర వాటా ఉందని, కరోనా వేళలో రాష్ట్రానికి ఏమి ఇవ్వలేదనడం, అబందాలు వేయడం సరికాదని అన్నారు. టీఆర్ఎస్ ఎంపీల ప్రశ్నలకు పార్లమెంట్ లో సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కిషన్ రెడ్డి అన్నారు.

ఈ నెలలోనే పెరమావాస్య

వచ్చే నెలలో బతుకమ్మ, దసరా - పండితుల అభిప్రాయం

వరంగల్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): బతుకమ్మ పండుగ నిర్వహణపై అందరిలోనూ అయోమయం నెలకొన్న వేళ ఈ నెలలో కేవలం ఎంగిలిపూల బతుకమ్మ వచ్చే నెలలో సద్దుల బుతకమ్మ, దసరా జరుపుకోవాలని పంచాంగకర్తలు సూచించారు. ప్రతి యేటా భాద్రపద మాసంలో వచ్చే అమావాస్య పితృ అమావాస్య రోజున ఎంగిలి పువ్వు బతుకమ్మతో మొదలై 9 రోజులు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. కానీ ఈ ఏడాది అధిక మాసం రావడంతో పండగ నిర్వహ ణపై చర్చ మొదలైంది. దీనిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేస్తే బాగుంటుందని జనం అభిప్రాయపడు తున్నారు. బతుకమ్మ పండుగ నిర్వహణపై సందిగ్ధత ఏర్పడింది. ఈ ఏడాది అధిక మాసం రావడంతో బతుకమ్మ పండగ నిర్వ హణపై చర్చ మొద లైంది. కొందరు పండి తులు యధావిధిగా ఈ నెల 17 న అమా వాస్య రోజు నుంచి ఎంగిలి పువ్వు బతుక మ్మ నిర్వహించి,. మళ్ళీ నెల తర్వాత అక్టో బర్ 17 నుంచి మిగతా 8 రోజులు పండుగ జరుపుకోవాలని అంటున్నారు. ఆచారాలకు, శాస్త్రాలతో బతుకమ్మని ముడిపెట్టొద్దనీ ఈ పండగ ఆచారంతో మొద లైందని ప్రముఖ సిద్ధాం తుల పలువురు చెబుతున్నారు. నిజ ఆశ్వీజ లోనే పండగ జరుపుకోవాలంటున్నారు. అక్టోబర్ 16న పండగని మొదలు పెట్టి వరుసగా తొమ్మిది రోజులు జరుపుకోవాలని చెబుతున్నారు. పండుగలను నిర్ణయించడం సిద్ధాంతులు పంచాంగకర్తలు చేసారనీ, నిర్ణయించిన పండుగలను వేద పండితులు, పురోహితులు ప్రకటిస్తారని అంటున్నారు. భాద్రపద అమా వాస్య రోజునే పండగ జరు పుకుని,మిగతా ఎనిమిది రోజులు అక్టోబర్ 17 నుంచి నిర్వహించుకో వాలని తెలంగాణ రాష్ట్ర వైదిక పురోహితుల సంఘం ప్రకటించింది. ఈనెల 17న పితృ అమావాస్య రోజున ఎంగిలిపువ్వు బతుకు మ్మను పేర్చుకోవాలనీ, వచ్చే నెల 17న ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుంచి 24న దుర్గాష్టమి వరకూ బతుకమ్మ పండుగ జరుపుకోవాలని చెబుతున్నారు.

కొత్త రెవెన్యూ చట్టంపై సర్వత్రా ఆసక్తి

-భూ తగదాలు పరిష్కారంపై ఆశ

జగిత్యాల,సెప్టెంబరు12 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి అంటూ తీసుకువస్తున్న కొత్త రెవెన్యూ చట్టంలో ఎలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వేలాది భూ సమస్యలు ఉన్నాయి. చాలామంది కబ్జాలో ఉన్నప్పటికీ పూర్వం నుంచే భూమి వస్తున్నప్పటికీ వారి పేర్లకు బదులుగా వేరే ఇతర పేర్లు రికార్డుల్లో కెక్కించారు. ఇలా అనేక అవకతవకలు జరుగకుండా ఇప్పుడు కొత్తచట్టంపై వారు ఆశలు పెట్టుకున్నారు. కొత్త చట్టం ద్వారా పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం కత్తగా తీసుకువచ్చిన రెవెన్యూ చట్టంతో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందా చూడాల్సిన అవసరం ఉంది. జగిత్యాల జిల్లా 2419 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఏర్పడింది. జిల్లాలో 18 మండలాలు ఉండగా, 287 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. దీనికితో డు ఐదు మున్సిపాలిటీలు ఉంటాయి. జిల్లాలో మొత్తం 7 లక్షల 56 వేల 132 సర్వే నెంబర్లు ఉండగా జిల్లాలో మొత్తం 6,83,791 ఎకరాల భూమి ఉంది. జిల్లాలో 174277 మంది రైతులు ఉండగా, ఇందులో ఒక హెక్టార్‌లోపు భూమి కలిగినవారు 1,22152 మంది ఉండగా, 2 హెక్టార్లలోపు భూమి గలవారు 33,610 మంది, 4 హెక్టార్లలోపు భూమి గలవారు 14069 మంది, 10 హెక్టార్లలోపు భూమి గలవారు 305 మంది, 10 హె క్టార్ల పైబడి భూమి ఉన్నవారు 305 మంది ఉన్నారు.

మొత్తం జిల్లాలో 4,20,784 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ప్రస్తుతం దాదాపు మూడు లక్షల 90 వేల ఎకరాల భూమి సాగు చేస్తున్నారు. దీనికి తోడు జిల్లాలో లక్షా 33వేల ఎకరాల అటవీ భూములున్నాయి. దాదాపు 1200 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయి. అసైన్డ్ భూముల లెక్కలు ఇప్పటికీ గందరగోళంగా ఉండగా జిల్లాలో ప్రభుత్వ భూములు 53695 ఎకరాలు ఉంది. అలాగే నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 19367 ఎకరాల భూమి ఉంది. ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరిట తీసుకుని వచ్చిన రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. చాలా మంది సాదా బైనామాలతో తమ భూములను క్రమబద్ధీకరించుకున్నారు. అయితే అప్పుడే జిల్లాలో అనేక గోల్‌మాల్‌లు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో పని చేసే రెవెన్యూ ఉద్యోగి కొంత మంది వ్యక్తులతో ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున రికార్డుల క్రమబద్ధీకరణలో పట్టాదారుల పేర్లు తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టాల జారీపై మరోమారు సందిగ్ధత

-పోడుదారులతో చర్చించనున్న ఎమ్మెల్యేలు

ఖమ్మం,సెప్టెంబరు12 (ఆర్ఎన్ఎ): ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ భూములకు కేంద్ర ప్రభుత్వమే యజమానిగా ఉంటుందని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటి వరకు పోడు రైతులకు జారీచేసిన ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు పట్టా సర్టిఫికెట్లు కావని, కేవలం ఫలసాయం అనుభవించడానికే అర్హులని సీఎం కేసీఆర్ రోమారు అసెంబ్లీలో స్పష్టం చేయడం గమనార్హం. ఈ విషయాన్ని పోడు రైతులకు చెప్పాలని శాసనసభ్యులను కోరారు. కరోనా ప్రభావం తగ్గాక ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాదర్బార్లు నిర్వహించి పోడు భూములకు పరిష్కారం చూపుతానని, తదనంతరం గుంట భూమి కూడా ఇవ్వబోమని సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయాలను ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీంతో ఇప్పుడు పోడు రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్న చర్చ సాగుతోంది. ఇప్పటికే పలుమార్లు పోడు రైతులు ఆందోళనకు దిగారు తమ భూముల్లో హరితహారం కింద మొక్కలు పెంచుతున్నారని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో రెవెన్యూ బిల్లు రూపొందించామని, పోడు భూములు సాగుచేస్తున్న వారికి జారీచేసిన ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు పట్టాలు కాదని, అటవీ భూములు ప్రభుత్వ భూములని, వాటికి కేంద్రమే యజమాని అని ముఖ్యమంత్రి కస్పష్టం చేయడం సంచలనంగా మారింది. రెవెన్యూ వ్యవస్థలో ధరణి పోర్టల్ అత్యంత కీలకంగా రెవెన్యూ బిల్లులో ప్రాధాన్యం సంచరించుకోవడం, అందులో అటవీభూములను కూడా ప్రస్తావించడం చర్చగగా మారింది.

అటవీభూములకు సోలార్ ఫెన్సింగ్

-అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు

మెదక్,సెప్టెంబరు12 (ఆర్ఎన్ఎ): దశాబ్దాల తరబడి నరికివేత, ఆక్రమణలకు గురైన అడవుల సంరక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల భారీ ఎత్తున నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా గతేడాది నర్సాపూర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని జిన్నారం, బొంతపల్లి, రొయ్యపల్లి, మంగంపేట గ్రామాల శివారులోని అటవీ ప్రాంతం చుట్టూ పూర్తిగా ప్రహరీ నిర్మాణం, ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ ఫెన్సింగ్‌లో 50 అడుగులకో సోలార్ లైటు ఉండేలా ఇటీవల స్తంభాలను ఏర్పాటు చేశారు. త్వరలోనే 50 కిలోమీటర్ల చుట్టూ సోలార్ లైట్ల వెలుగులు విరజిమ్మనున్నాయి. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలంలోని అడవులకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే అటవీ ప్రాంతాలను అర్బన్ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను చేపట్టింది. రాష్ట్ర రాజధానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాజీపల్లి అటవీ ప్రాంతం 1,650 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, ఔటర్ రింగ్‌రోడ్డుకు ఆనుకుని ఉండే ప్రాంతం కావడంతో ప్రభుత్వం ఈ ప్రాంత అటవీ రక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. నగరంలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోతుండగా రాజధాని సమీప ప్రాంతంలోని అడవుల రక్షణ, అభివృద్ధి, అర్బన్ పార్కుల ఏర్పాటు కోసం ప్రముఖులకు దత్తత ఇవ్వాలనే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాజీపల్లి అటవీ ప్రాంతం కొండలతో చిట్టడవిగా ఉండటంతో ఇక్కడ అభివృద్ధి చేపడితే పర్యాటక ప్రాంతంగా మారనున్నది.

ఇక వీరన్నగూడెం పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రస్తుతం అర్బన్ పార్కు పనులు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటైన వావిలాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కాజీపల్లి అటవీ ప్రాంత అభివృద్ధికి తాజాగా చర్యలు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్, ట్రీ పార్కు, ప్రత్యేక మొక్కల పెంపకం, వ్యూ పాయింట్‌తో పాటు ప్రస్తుతం ఉన్న వృక్షాలకు రక్షణ పనులు చేయనున్నారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా సినీ హీరో ప్రభాస్ గతంలో మొక్కలు నాటారు. కాజీపల్లి అటవీ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా ఎంపీ సంతోషకుమార్ సూచనతో అర్బన్ పార్కు కోసం తన తండ్రి యూవీఎస్ రాజు పేరిట ప్రభాస్ రూ.2 కోట్ల విరాళం అందజేశారు.

నిరుద్యోగ యువత గుండెచప్పుడు వినడం లేదా

నాగులు ఆత్మహత్యాయత్నంతో అయినా కళ్లు తెరవాలి
ప్రకటనలతో నిరుద్యోగులను వంచించిన సిఎం కెసిఆర్: రేవంత్

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): కేసీఆర్ కనికరం లేని ముఖ్యమంత్రి అనిసీఎం కేసీఆర్‌పై ఎంపీ రేవంత్‌రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. కేటీఆర్ సూటూబూటూ వేసుకుని, బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో ఫోటోలు దిగితే ఉద్యోగాలు వచ్చినట్టేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ దగ్గర నాగులు ఆ

జిల్లాలో అటవీభూములపై వివాదాలు

-రెవన్యూ,అటవీశాఖల మధ్య తేలని పంచాయితీ

ఆసిఫాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): జిల్లాలో భూ సంబంధిత వివాదాలు కేవలం రైతులు, ప్రయివేటు వ్యక్తుల మధ్యనే కాకుండా అటవీ, రెవెన్యూశాఖల మధ్య కొనసాగుతోంది. జిల్లాలో అటవీ శాఖ లెక్కల ప్రకారం 40వేల ఎకారాలకు పైగా అటవీ భూములను రెవెన్యూ శాఖ తమదిగా చెబుతున్నట్టు ఆరోపిస్తున్నారు. అయితే రెవెన్యూ శాఖ మాత్రం జిల్లా అంతా లెక్క గట్టినా 100 నుంచి 200 ఎకరాలకు అటవీ భూములు ఉంటాయని అంటున్నారు. అటవీ అధికారుల వాదన ప్రకారం జిల్లాలో సుమారు 6లక్షలకు ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉన్నట్టు చెబుతున్నారు. ఇందులో లక్ష ఎకరాలకుపైగా అటవీ భూమి అక్రమార్కుల చేతుల్లో ఉందని అంటున్నారు. ఇదీ కాకుండా ఆర్ఓఎఫ్ఆర్ కింద 37వేల ఎకరాల మేర ఆదిసీలకు పట్టాలిచ్చినట్టు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 70 నుంచి 80 ఏళ్ల క్రితం భూములు విక్రయించిన పట్టే దార్లు పేర్లు కూడా తాజా ప్రక్షాణాల్లో నమోదు కావడం రెవెన్యూ అధికారుల పని తీరును ప్రశ్నార్థకం చేసింది. జిల్లాలోని 15 మండలాల్లో రమారమి 5,231 ఖాతాలకు సంబంధించి 62,772 ఎకరాల విస్తీర్ణంలో వివాదాలు కొనసా గుతున్నట్టు చెబుతున్నారు. ఈ తరహా వివాదాలు అత్యధికంగా చింతల మానేపల్లి, వాంకిడి, రెబ్బెన, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ , కెరమెరి మండలాల్లో ఉన్నట్టు గుర్తించారు. కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట, చింతలమానేపల్లి వాంకిడి మండలాల పరిధిలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య హద్దుల వివాదాలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో రెండు శాఖల సంయుక్తంగా భూ సర్వే జరుపాలని నిర్ణయించిన్పటికీ ఇప్పటి వరకు సాధ్యం కాలేదు. ప్రభుత్వం తాజాగా సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టేందుకు యోచిస్తున్న నేపథ్యంలో ఇకనైనా ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభించనుందని ప్రజలు భావిస్తున్నారు.

సాగుదార్ల రక్షణకు ప్రత్యామ్నాయం ఆలోచించాలి

వారికి అండగా నిలవకుంటే యవుసం పడావు పడుతుంది

వరంగల్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): రైతుబందు ప్రవేశ పెట్టినప్పుడు కౌలుదార్లకు అవకాశం లేదని సిఎం కెసిఆర్ ఖరాఖండీగా చెప్పారు. అదే అమలు చేశారు. తాజా రెవెన్యూ చట్టంలో అసలు కౌలుదారు సమస్యలను ప్రస్తావించలేదు. ఇంతకాలం కౌలుదార్ల పేరుతో వామపక్షాలు పోరాటం చేసే వారు.పోడు భూముల పేరుతో కూడా ఇప్పటికీ పోరాడుతున్నారు. ఈ రెండు విషయాల్లో సిఎం కెసిఆర్ బాగా దూరదృష్టితో ఆలోచన చేశారని అనిపిస్తోంది. కౌలుదారు కాలమ్ వల్ల పట్టాదారుకు తీరని అన్యాయం జరుగుతోంది. భూమి తమదైనా ఎల్లకాలం తమది కాదన్న భయం ఇంతకాలం ఉండేది. ఇప్పుడా భయం లేదు. భూమి కొనుక్కున్న వారికి ఇక భరోసా దక్కగలదు. నిశ్చింతంగా కొనుక్కుని ఉంటామన్న భరోసా దక్కింది. కౌలుదారు పేరుతో కబ్జా చేసే సమస్యలకు చెక్ పడిందనే చెప్పాలి. ఇక పోడు భూమలకు సంబంధించి అటవీ భూములకు కూడా రక్షణ కలగనుంది. పోడుపేరుతో అడవులను నరుకుతూ ఎడారులగా మారుస్తున్న వారికి అడ్డుచక్రం పడింది. అడవిని నమ్ముకుని బతకాలే తప్ప అమ్ముకుని కాదని వారు గుర్తించాలి. పోడు కోసం అటవీసంపదను నాశనం చేయడం కూడా సరికాదు. మొత్తంగా కొత్త రెవెన్యూ చట్టంతో కొంత మేలు జరిగిందనే చెప్పాలి. ఇక నుంచి వ్యవసాయ భూమి కేవలం ఆస్తి మాత్రమే. అది జీవనాధార వనరు అయినా.. కిరాయి ఇల్లు లాంటిది. అద్దె కట్టినంత కాలం అక్కడ ఉండవచ్చు. అద్దె కడుతున్నామని చెప్పి అక్కడే తిష్టవేసి తరవాత ఇక మాదే అంటే చెల్లదు. అటవీభూములకు ఉన్న రక్షణెళి ఇక్కడ యజమానులకు కూడా రానుండడం మంచి పరిణామంగానే చూడాలి. నమ్మి భూమిని చేతిలో పెడితే వంచనతో పట్టాలు చేయించుకుంటే కుదరదు. అయితే సాగుదారు బతుకు ప్రయోజనాలకు, వారి సాగుకు ఆసరా కల్పించడానికి సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. వారికి రైతుబంధు, బీమా, బ్యాంకు రుణం, పంట నష్టపరిహారం వంటివి అందించేలా చేయాలి. లేకుంటే వ్యవసాయ మనుగడ కూడా దెబ్బతిన గలదు. ప్రభుత్వ ప్రస్తుత విధానాలతో మొదటి దశలో సాగుదార్లు భూమి హక్కుదార్లు కాదు. చిన్న, సన్నకారు రైతులకు వస్తున్న ప్రయోజనాలు కూడా ఖాస్తుదారులకు వస్తే వ్యవసాయం మరింతగా ముందుకు సాగగలదు. వ్యవసాయం చేయనివారు, గ్రామంలో నివాసం ఉండని వారు వ్యవసాయం చేయడంలేదు. అలా చేయకపోతే..ఖాస్తుదారు ముందుకు రాకపోతే వ్యవసాయం పడావు పడుతుంది. సాగు యోగ్యమైన వ్యవసాయ భూమి అందుబాటులోకి వచ్చే విధమైన మార్పుల్లో భాగంగా సాగుదారులకు ఏ రకంగా అండగా ఉంటారన్నది కూడా ఆలోచన చేయాలి.

మిషన్ బగీరథతో ఇంటింటికీ మంచినీరు

రూ.42 కోట్లతో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం
మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడి

నిర్మల్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రతి గడపకు నీరందించే లక్ష్యంతో పనులు వరవవేగంగా సాగుతున్నాయని అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలో బంగల్ పెట్ విసురాళ్ళ గుట్ట వద్ద నూతనంగా నిర్మించనున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులకు శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవర్గంలో రూ.42 కోట్ల నిధులతో మిషన్ భగీరథ పథకంలో 5 వాటర్ ట్యాంక్ లను నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పట్టణ ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. విసురాల గుట్ట వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ద్వారా 42 వార్డులకు నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రతి ఇంటికి త్రాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇప్పటికే గ్రామాల్లోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు పంపిణీ అవుతున్నాయని త్వరలోనే పట్టణంలోనూ ఈ నదుపాయం కలిపిస్తామన్నారు. ఒక రూపాయికె నల్లా కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికి నీళ్లు అందనున్నాయని తెలిపారు. పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద సమీకృత మార్కెట్ ను నిర్మిస్తున్నామని, రూ. 50 లక్షల నిధులతో ఫిష్ మార్కెట్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి వార్డులో ప్రజా దర్బార్ నిర్వహించి డిసెంబర్ నాటికి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రకటిస్తామన్నారు. పారదర్శకంగా ఇండ్ల ఎంపిక జరుగుతుందని ఇందులో ఎవరి ప్రమేయం ఉండదన్నారు. నిర్మల్ పట్టణాన్ని రాబోయే రోజుల్లో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతకు ముందు రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా సోమవార్ పెట్, నాయుడు వాడ వద్ద డ్రైనేజీ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు.

నిర్మల్‌లో మిషన్ భగీరథ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

తెలంగాణ ఏర్పాటులో విప్లవం

ఇప్పుడు రెవెన్యూ విప్లవం తెచ్చిన కెసిఆర్: సామేలు

యాదాద్రి భువనగిరి,సెప్టెం బర్12 (ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ముఖ్యమంత్రి కేసిఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆదుకుంటున్నారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేలు అన్నారు. తాజాగా రెవెన్యూ చట్టంతో రూపురేఖలు మారనున్నాయని అన్నారు. అడ్డగూడూర్ మండలంలోని స్వగ్రామం ధర్మారంలో మందుల సామేలు మీడియా తో మాట్లాడారు. వీఆర్‌వో వ్యవస్థ రద్దు , నూతన రెవిన్యూ బిల్లు ఆమోదంతో గ్రామ గ్రామాన రైతులు సంబరాలు జరుపుకుంటూ ఆనందంగా ఉన్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం అయిందన్నారు. కాగా వె?త్కూర్, అడ్డగూడూర్ మండలాలకు బునాదిగానికాల్వ, పిలాయిపల్లి, ధర్మారం కాల్వలు పూర్తి చేసి బస్వాపురం రిజర్వాయర్ ద్వారా సాగు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ధర్మారం పొలిమేరలో బిక్కేరు వాగుపై రూ. 8 కోట్ల 50 లక్షల 40 వేల వ్యయంతో చెక్ డ్యాంమ్ మంజూరు అయిందని చెప్పారు. ఈ వాగుకు నీరు రావడంతో అడ్డగూడూర్ మండలంలో సుమారు 7 వేల ఎకరాలు సాగులోకి వచ్చింది అన్నారు. అలాగే ధర్మారం చెరువును రిజర్వాయర్‌గా చేస్తే ధర్మారం, లక్ష్మీదేవికాల్వ గ్రామాలలో 4 వేల ఎకరాలకు నీరు పారుతుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం జ్యోతి రాములు, టీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తాడోజు లక్ష్మణాచారి. వార్డు సభ్యులు మందుల సువర్ణజాని జక్కుల బాగ్యరావు, టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోలినేని సోమయ్య, యూత్ అధ్యక్షులు మందుల స్తెదులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మందుల విజయ్, నాయకులు సంద అంజయ్య కత్తుల నరేష్, కప్పల కనకయ్య, మేకల పద్మయ్య, బండారి వీరయ్య, బాల్నె బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త : ఇన్స్పెక్టర్ వెంకటేష్

వేములవాడ, సెప్టెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి)ఆన్లైన్ మోసాల తో ప్రజలు అప్రమత్తం గా ఉండాలి అని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్ తెలిపారు. ఇటీవలి కాలంలో ఆన్లైన్ మోసాలు చేయుటకు హాకర్స్ మొబైల్ ద్వారా బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ తెలుసుకోని బ్యాంక్ నుండి మాట్లాడుతున్నాం మీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయిన్ది అని అకౌంట్ డీటెయిల్స్ చెప్పమని కాల్ చేసిన కూడా ఎవరు బ్యాంక్ డీటెయిల్స్ ఇవ్వకండి ఎందుకంటే బ్యాంక్ వారు అకౌంట్ కు సంబందించి ఎలాంటి వివరాలు ఫోన్ లో అడగరు. ప్రస్తుత కాలం లో వాట్సాప్ ద్వారా హాకర్స్ లింక్ లు పంపటం వాట్సాప్ లో చాటింగ్ చేస్తూ మీరు లక్షల్లో లాటరీ గెలుపొందారు కొంత అమౌంట్ కడితే మీకు లాటరీ కి సంబందించిన అమౌంట్ పంపుతాం అని మోసం చేస్తున్నారు. మీకు తెలిసిన నెంబర్ ను కూడా హాక్ చేసి వాట్సాప్ లో చాటింగ్ చేస్తూ డబ్బులు మాయం చేస్తున్నారు కాబట్టి మీకు తెలిసిన నెంబర్ అయినా కూడా అవతలి వ్యక్తి తో మాట్లాడి నిజమే అని నిర్ధారణ కు వచ్చాకే లావాదేవీలు జరపాలి అని హాకర్స్ చేతుల్లో ప్రజలు మోసపోవద్దు అని ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు

భవిష్యత్తు అంధకారాన్ని తొలగించేది ఎల్ఐసి
-ఎల్ఐసి బీమా గ్రామంగా రుద్రవరం

వేములవాడ, సెప్టెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి): పేదింటి వారి భవిష్యత్తు లో అంధకారాన్ని తొలగించి వెలుగులు నింపేది ఒక్క ఎల్ఐసి తోనే సాధ్యమౌతుందని ఎల్ఐసి సిరిసిల్ల బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాంజీ తెలిపారు. 2019 సంవత్సరమునకు సిరిసిల్ల జిల్లాలోనీ రుద్రవరం గ్రామాన్ని ఎల్ఐసి బీమా గ్రామంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే సంవత్సరంలో 100 పాలసీల పైన చేసి, వాటికి సరైన టైంలో కిస్తులు చెల్లించిన గ్రామంగా రుద్రవరం గ్రామం హర్నించదగిన అని అన్నారు. ఈమేరకు ఈ గ్రామానికి రూ.50 వేల విలువ గల చెక్కును గ్రామ సర్పంచ్ ఊర డి రామ్ రెడ్డి, ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి, ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఎల్ఐసి సిరిసిల్ల బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాంజీ, ఏబీ ఎం వెంకట్లు గ్రామ పంచాయతీకి అందజేశారు. సందర్భంగా పాలసీలకు పాలసీదారులకు సహకరించిన రుద్రవరం గ్రామ ప్రజలకు ప్రజాప్రతినిధులకు ఎల్ఐసి పాలసీ హోల్డర్లకు బీమా గ్రామం కావడానికి సహకరించిన ఎల్ఐసి ఏజెంట్ గాలి పెల్లి రవీందర్, బ్రాంచ్ మేనేజర్ క్లబ్ నెంబర్ మరియు ఎండి రహీం పశ్చిమ మట్ల శ్రీనివాస్ గాలి పెల్లి శ్రీకాంత్ ఉరాడి శ్రీనివాస్ లతో పాటు ఎల్ఐసి మిత్రులకు అందరికీ ఎల్ఐసి జోనల్ మేనేజర్ క్లబ్ నెంబర్ జిల్లా కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

కరోనాను జయించిన మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు కరోనాను జయించారు. హరీష్‌రావుకు కరోనా నెగిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన మంత్రికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో హోం ఐసోలేషన్ ఉన్న విషయం తెలిసిందే. అప్పట్నుంచి వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ హరీష్‌రావు కరోనాను జయించారు. దీంతో ఆయన సోమవారం నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉంది. కరోనా బారిన పడ్డ మంత్రి హరీష్‌రావు త్వరగా కోలుకోవాలని మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ కవితతో పాటు పలువురు ఆకాంక్షించిన విషయం విదితమే.

రైతల సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం: కొప్పుల

పెద్దపల్లి,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకువస్తూ సీఎం కేసీఆర్ రైతుల మేలు కోసం కృషి చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేసినందుకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్, పత్తిపాక గ్రామాలకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌వో వ్యవస్థ రద్దుతో రెవెన్యూశాఖలో అవినీతికి అడ్డుకట్ట పడుతుందన్నారు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయడం మంచి నిర్ణయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ప్రజలకు పారదర్శక పాలన, మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగడపడుతుందని పేర్కొన్నారు.

చండీఘడ్‌లో కార్మిక బ్యూరో భవన్
ప్రారంభించిన కేంద్రమంత్రి గంగ్వార్

చండీఘడ్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): చండీఘడ్‌లో నూతనంగా నిర్మించిన కార్మిక బ్యూరో,భవన్‌ను కేంద్ర కార్మిక ,ఉపాధి శాఖ సహాయమంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన అన్ని రకాల సమాచారం , విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకంగా ఉపయోగపడుతుందని అన్నారు. అందుకు కార్మికులకు సంబంధించిన గణాంక వివరాల సేకరణకు ప్రత్యేకంగా లేబర్ బ్యూరో వంటి సంస్థ ఉండడం అవసరమని ఆయన అన్నారు. భవిష్యత్ లో డాటా ప్రాదాన్యత మరింత పెరగనున్నదని , భారతదేశంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉన్నారని, అందువల్ల కార్మికులకు సంబంధించిన గణాంకాలకు ఈ బ్యూరో ను బలోపేతంచేయడం ఎంతైనా అవసరమని' ఆయన అన్నారు. కార్మిక బ్యూరో ఈ ఏడాది అన్ని విధాలుగా అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నట్టు గంగ్వార్ చెప్పారు. ఈ బ్యూరో ఏర్పడిన వంద సంవత్సరాల తర్వాత సంస్థ లోగోను ఆవిష్కరించుకోవడంతో పాటు , ఈ సంస్థ నూతన భవనంలోకి ప్రవేశిస్తున్నదని ఆయన తెలిపారు. ప్రత్యేకించి ప్రొఫెషనల్ సంస్థలు, ఇంటిపనులు చేసేవారిపై రెండు పెద్ద సర్వేలను ఈ సంస్థకు అప్పగించడం జరిగిందని అన్నారు. ఇటీవల తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లపై డాటాసేకరించే లక్ష్యాన్ని ఈ సంస్థకు అప్పగించినట్టు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

వరంగల్ రూరల్,సెప్టెంబర్ 12(ఆర్ ఎన్ఎ): అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపురం శివారు సాయిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు రైడ్ చేసి లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్, మరొక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. లారీని నల్లబెల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

చదువుకున్న కాలేజీల్లోనే ఫైనల్ ఇయర్ పరీక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్12(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో విద్యార్థులు చదివిన కాలేజీల్లోనే డిగ్రీ, పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ స్పెషల్ సీఎస్ ఉన్నత విద్యామండలికి సూచించారు.

కార్మిక బ్యూరో భవనాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి గంగ్వార్

చండీఘడ్‌లో శ్రామిక్ భవన్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి గంగ్వార్

చండీఘడ్, సెప్టెంబర్ 12: చండీఘడ్‌లో నూతనంగా నిర్మించిన కార్మిక బ్యూరో,(శ్రమ్‌బ్యూరో)భవన్‌ను కేంద్ర కార్మిక ,ఉపాధి శాఖ సహాయమంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన అన్ని రకాల సమాచారం , విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకంగా ఉపయోగపడుతుందని" అన్నారు. అందుకు కార్మికులకు సంబంధించిన గణాంక వివరాల సేకరణకు ప్రత్యేకంగా లేబర్ బ్యూరో వంటి సంస్థ ఉండడం అవసరమని" ఆయన అన్నారు. భవిష్యత్ లో డాటా ప్రాదాన్యత మరింత పెరగనున్నదని , భారతదేశంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉన్నారని, అందువల్ల కార్మికులకు సంబంధించిన గణాంకాలకు ఈ బ్యూరో ను బలోపేతంచేయడం ఎంతైనా అవసరమని" ఆయన అన్నారు.

కార్మిక బ్యూరో ఈ ఏడాది అన్ని విధాలుగా అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నట్టు గంగ్వార్ చెప్పారు. ఈ బ్యూరో ఏర్పడిన వంద సంవత్సరాల తర్వాత సంస్థ లోగోను ఆవిష్కరించుకోవడంతో పాటు , ఈ సంస్థ నూతన భవనంలోకి ప్రవేశిస్తున్నదని ఆయన తెలిపారు. ప్రత్యేకించి ప్రొఫెషనల్ సంస్థలు, ఇంటిపనులు చేసేవారిపై రెండు పెద్ద సర్వేలను ఈ సంస్థకు అప్పగించడం జరిగిందని అన్నారు. ఇటీవల తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లపై డాటాసేకరించే లక్ష్యాన్ని ఈ సంస్థకు అప్పగించినట్టు చెప్పారు.

ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే ఎఖా గారి ఆధ్వర్యంలో వృద్ధులకి ఆరోగ్య కిట్స్ అందజేత

వేములవాడ, సెప్టెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి):జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే ఎఖా గారి ఆధ్వర్యంలో జిల్లా లోని మా స్వచ్ఛంద సేవ సంస్థ వృద్ధాశ్రములో ఉన్న వృద్ధులకి ఆరోగ్య కిట్స్ అందజేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూరోజు రోజుకు పెరిగిపోతున్న కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండలని చెప్పారు.. కరోనా బారిన పడకుండా ఈ రోజు జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే ఎఖా గారు ట్రస్ట్ లో ఉన్న వారందరికీ (ఆరోగ్య కిట్స్) ఫేస్ మాస్క్ ,మాస్క్,విటమిన్-సి టాబ్లెట్స్,శానిటైజర్ లను అదజేశారు....బయట నుండి వచ్చే వారితో జాగ్రత్తగా ఉండాలని భౌతిక దూరం పాటించాలని చెప్పారు..మరేదైనా అవసరాలకు బయటకి వెళ్లి వచ్చిన వెంటనే లోనికి వెళ్లకుండా చేతులు కాళ్లు శుభ్రం చేసుకున్న తర్వాతే ఇంట్లోకి వెళ్లాలని చెప్పారు..ఎస్పీ గారు మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను కొడుకులు మరియు వారి కుటుంబ సభ్యులు చేదోడువాదోడుగా ఉంటూ మంచిగా చూసుకోవాలని సూచించారు.అందరూ ధైర్యంగా ఉండాలి ఎస్పీ గారు చెప్పారుఈ కార్యక్రమంలో టౌన్ డిస్పీ చంద్రశేఖర్ గారు,సి.ఐ బన్సీలాల్ గారు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

కరోనాను జయించి విధుల్లోకి చేరిన టాస్క్ ఫోర్స్ సీఐగారికి మరియు డ్రైవర్ వీరయ్యకు సన్మానం

వేములవాడ, సెప్టెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి)కరోనాను జయించి విధుల్లోకి చేరిన టాస్క్ ఫోర్స్ సీఐ గారికి మరియు డ్రైవర్ వీరయ్య కు సన్మానం చేసి విధులకు స్వాగత పలికిన సిబ్బందిరాజన్న సిరిసిల్ల టాస్క్ ఫోర్స్ లో విధులు నిర్వహిస్తున్న సీఐ గారు మరియు డ్రైవర్ వీరయ్య లు గత కొన్ని రోజుల క్రితం కరోనా పాజిటివ్ రాగ వైద్యుల సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకొని కరోనా వ్యాధిని జయించి తిరిగి విధులకు హాజరైన టాస్క్ ఫోర్స్ సీఐ గారికి మరియు డ్రైవర్ వీరయ్య కు టాస్క్ ఫోర్స్ సిబ్బంది స్వాగతం తెలిపి అభినందనలు తెలియజేసారు

నేర నియంత్రణలో , నేర చెదనలో అఐ కెమెరాలది కీలకమైన పాత్ర

వేములవాడ, సెప్టెంబర్ 12 (నేటినిజం ప్రతినిధి)నేర నియంత్రణలో , నేర చెదనలో అఐ కెమెరాలది కీలకమైన పాత్ర జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే ఎఖా గారుఅఐ కెమెరాల స్థాపనకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి జిల్లా ఎస్పీగంభీరావుపేట మండలం లో ఏర్పాటు చేసిన సి సి కెమెరా లను జిల్లా ఎస్పీ గారు ప్రారంభించారు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ నేరం జరిగినపుడు కెమెరాలు మనకు నేర నిరూపణలో బాగా ఉపయోగ పడుతున్నాయి అని ప్రతి ఒక్కరు సి సి కెమెరాల ఏర్పాటు కు ముందుకు రావాలి అని, ప్రజా రక్షణ కు కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడుతాయి అని, మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలి అని అన్నారు..

శాంతి భద్రతలను అరికట్టడానికి ప్రజల తొడపడలని సూచించారు.గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.గతం లో వలు హత్యలు చైన్ ష్నిచింగ్ దొంగతనాలు సీసీ కెమెరాల పట్టించాయన్నారు.అపరిచిత వ్యక్తులను ఆరా తీసేవారు లేకుండా పోయారని అందుకే సీసీ కెమెరాల అవసరం ఎంతగానో ఉందని చెప్పారు.సిసి కెమెరాలు నిరంతరం పని చేస్తాయని దీనివలన నేరస్తులను సులభంగా పట్టుకోవచు అని అన్నారు.

ప్రతీ గ్రామం లో, పట్టణ వీధులలో కూడా ప్రతీ ఒక్కరు విధిగా కెమెరా ల ఏర్పాటు చేసుకొనుటకు ముందుకు రావాలి అని నేను సైతం ప్రోగ్రామ్ లో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని కోరారు.

ఈ కార్యక్రమంలో టౌన్ డిస్పీ చంద్రశేఖర్ గారు,సి.ఐ బన్సీలాల్ గారు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.